నిర్భయవార్త తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.com
http://nirbhayavaartha.com

# నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY



**విలేకరులు కావలెను**
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న "నిర్భయవార్త" తెలుగు దినపత్రికకు జర్నలిజంపై ఆసక్తి కలిగి, అన్ని జిల్లాల నుండి బ్యూరో ఇన్‌చార్జ్‌లు, స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్‌సి ఇంచార్జీలు మండలాల వారిగా విలేకరులు కావలెను.
సంప్రదించండి
సెల్ : 7799013939



సంపుటి :12 సంచిక :319 రంగారెడ్డి | శనివారం 14 మార్చి 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To : ★ Hyderabad ★ Ranga Reddy ★ Nizamabad ★ Warangal ★ Mulugu ★ Shadnagar ★ Yadadri ★ Nalgonda ★ Karimnagar ★ Khammam ★ Medak ★ Sangareddy ★ Siddipet ★ Medchal ★ Jagityal ★ Vemulawada





# ఆందోళన వద్దు
## సమృద్ధిగానే గ్యాస్ నిల్వలు

- వంట గ్యాస్‌కు కొరత లేదన్న మంత్రి ఉత్తమ్
- గందరగోళానికి గురికావద్దని వినియోగదారులకు హితవు
- కేంద్రం నిబంధనలకు అనుగుణంగానే గ్యాస్ సరఫరా
- గ్యాస్ బుక్ చేసిన మూడు రోజుల్లోనే సిలిండర్ డెలివరీ
- వంట గ్యాస్ బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు





హైదరాబాద్, మార్చి13 నిర్భయవార్త ప్రతినిధి : తెలంగాణలో గ్యాస్ సిలిండర్లకు కొరత లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. నిర్దేశించిన కాల పరిమితిలో బుక్ చేసుకుంటే మూడు రోజులలోనే డెలివరీ చేస్తామని చెప్పారు. గ్యాస్ కొరతపై మంత్రి ఉత్తమ్ శుక్రవారం సచివాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి సీఎస్, కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు, గ్యాస్, ఆయిల్ కంపెనీలు, లీగల్ మెట్రలాజీ అధికారులు హాజరయ్యారు. సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. గ్యాస్ గృహవినియోగదారులు గందరగోళానికి గురికాకుండా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. గృహ వినియోగదారులకు సరిపడా గ్యాస్ ఉందని, రిఫిల్ బుక్ చేసుకున్న వారికి ఎటువంటి ఆటంకం లేకుండా సరఫరా చేస్తామని తెలిపారు. ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన పని లేదని పేర్కొన్నారు. ప్రధానంగా గ్యాస్ నిల్వలు, అంతర్జాతీయ పరిస్థితులపై మంత్రి ఆరా తీశారు. ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించాలని మార్గనిర్దేశం చేశారు. గ్యాస్‌ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని స్పష్టం చేశారు. గ్యాస్ గృహ వినియోగదారులకు ఎక్కడ అసౌకర్యం కలిగించేలా చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గ్యాస్‌ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే ఎక్కడికక్కడ చర్యలు చేపట్టాలని.. కలెక్టర్లకు, సీపీలకు, ఎస్పీలకు ఆదేశాలు జారీ చేశారు. ఆస్పత్రులకు, ప్రభుత్వ వసతి గృహాలకు సరిపడా గ్యాస్ సరఫరా చేయాలని మంత్రి ఆదేశించారు.. వాణిజ్య గ్యాస్ ను నిబంధనలకు అనుగుణంగా డెలివరీ చేయాలని సూచించారు.

# సమస్యల పరిష్కారం కోసం చర్చలు అవసరం
## ఇరాన్ అధ్యక్షుడు మసాద్‌తో మోదీ



ఢిల్లీ, మార్చి13 నిర్భయవార్త : ఇరాన్ – ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌కు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి ఫోన్ చేశారు. పశ్చిమాసియా దేశాల్లో యుద్ధ తీవ్రత పెరగడం, యుద్ధంలో సామాన్య ప్రజలు, పౌరుల ఆస్తులు ధ్వంసం కావడంపై మోదీ విచారం వ్యక్తం చేశారు. ఈ ఉద్రిక్తతల నడుమ ఇరువైపులా ఎవరూ వెనక్కి తగ్గని నేపథ్యంలో పరిస్థితులు విపరీత పరిణామాల వైపు దారితీస్తుండటంపై మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించారాయన.'ఇరాన్ ప్రెసిడెంట్ డాక్టర్ మసౌద్ పెజెష్కియాన్‌తో ప్రాంతీయ పరిస్థితులపై చర్చించాను. అక్కడ ఉద్రిక్తతలు పెరగడం, పౌరుల ప్రాణనష్టం అలాగే పౌర మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లడంపై ఆందోళన చెందాను. భారతీయ పౌరుల భద్రత, వస్తువులు, నిరంతర ఇంధన సరఫరా వంటివి భారత్ ప్రాధాన్య అంశాలుగా ఉన్నాయి. అంతేకాకుండా.. శాంతి, స్థిరత్వానికి దేశం నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, సమస్యల పరిష్కారం కోసం చర్చలు, దౌత్యపరమైన జోక్యం అవసరమన్నాను' అని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు. కాగా.. ఇరాన్ – ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య యుద్ధం నేటికి 14వ రోజుకు చేరుకుంది. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయారు. దీంతో పశ్చిమాసియాలో పరిస్థితులు యుద్ధానికి దారితీశాయి. ఈ నేపథ్యంలో పది రోజుల వ్యవధిలో మోదీ ఆయా పశ్చిమాసియా దేశాల నేతలతో సంభాషించారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ ఉమ్మడి దాడులు ప్రారంభమైన వేళ ఇరాన్ ప్రధాని పెజెష్కియాన్‌తో తొలిసారి మాట్లాడారు మోదీ.

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన..
## ఉభయసభల్లో తీర్మానం నోటీసు



న్యూఢిల్లీ, మార్చి13 నిర్భయవార్త : ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలంటూ 'ఇండియా' కూటమి పార్టీలు ఒక తీర్మానాన్ని పార్లమెంటు ముందుకు తెచ్చాయి. ఇందుకు సంబంధించిన తీర్మానం నోటీసును పార్లమెంటు ఉభయ సభల్లోనూ విపక్ష నేతలు శుక్రవారంనాడు ప్రవేశపెట్టారు. తీర్మానం నోటీసుపై 193 మంది ఎంపీలు సంతకాలు చేశారు. వీరిలో 130 మంది లోక్‌సభ, 63 మంది రాజ్యసభ ఎంపీలు ఉన్నారు. ఈ తీర్మానానికి సంబంధించి తృణమూల్ కాంగ్రెస్ ఇచ్చిన నోటీసు లోక్‌సభ సెక్రటేరియట్‌కు అందిందని, నోటీసు పరిశీలన ప్రక్రియ త్వరలోనే ప్రారంభమవుతుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. 'ఇండియా' కూటమికి దూరంగా ఉంటున్న ఆమ్ ఆద్మీ పార్టీ సైతం తీర్మానం నోటీసుపై సంతకాలు చేసింది. పలువురు ఇండిపెండెంట్ ఎంపీలు కూడా ఇందులో ఉన్నారు. ఎన్నికల ప్రధాన కమిషనర్‌ను తొలగించడానికి నోటీసు ఇవ్వడం భారత పార్లమెంటు చరిత్రలో ఇదే మొదటిసారి.

**ఏడు ఆరోపణలు**

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై ప్రవేశపెట్టిన తీర్మానం నోటీసులో విపక్షాలు ఏడు ప్రధాన ఆరోపణలు చేసినట్టు తెలుస్తోంది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి పక్షపాత నిర్ణయాలు తీసుకుంటున్నారని, అనుచిత ప్రవర్తన రుజువైందని, ఎన్నికల అవకతవకలపై విచారణను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని, సామూహికంగా ఓటుహక్కును రద్దుచేశారని విపక్షాలు ఆరోపించాయి. కొన్ని పార్టీలకు అనుకూలంగా పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తున్నారని కూడా నోటీసులో పేర్కొన్నాయి. తమ ఆరోపణలకు బలంచేకూర్చే పలు సుప్రీంకోర్టు తీర్పులను సైతం నోటీసులో ప్రస్తావించాయి. ఎస్ఐఆర్ ప్రక్రియలో కేంద్రంలోని అధికార పార్టీకి అనుకూలంగా సీఈసీ వ్యవహరిస్తున్నారని ఆరోపించాయి.

**అభిశంసన ఇలా..**

రాజ్యాంగ నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించే పద్ధతిలోనే సీఈసీని తొలగించాల్సి ఉంటుంది. ఇందుకు లోక్‌సభలో 100 మంది, రాజ్యసభలో 50 మంది సంతకాలు అవసరం. స్పీకర్ నోటీసును అంగీకరిస్తే ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీ ఈ ఆరోపణలను పరిశీలిస్తుంది. ఆరోపణలు నిజమని తేలితే తీర్మానంపై ఓటింగ్ నిర్వహిస్తున్నారు. ఉభయసభల్లోనూ హాజరైన ఎంపీల్లో మూడింట రెండు వంతుల మెజారిటీ లభిస్తే తీర్మానం నెగ్గుతుంది.

# మూసీ ప్రాజెక్ట్‌కు బీజేపీ వ్యతిరేకం కాదు: టీ బీజేపీ చీఫ్




హైదరాబాద్, మార్చి13 నిర్భయవార్త ప్రతినిధి : మూసీ ప్రాజెక్ట్‌పై బీజేపీకి వ్యతిరేకత లేదని.. కాని పేదల ఇళ్లు కూల్చడాన్ని మాత్రం వ్యతిరేకిస్తామని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా రాంచందర్ రావు శుక్రవారం హైదరాబాద్‌లో మాట్లాడారు. మూసీపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ పట్ల బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. మూసీ నది పునరుజ్జీవనానికి కానీ.. మూసీ ప్రాజెక్ట్‌ను కానీ బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకించలేదని తెలిపారు. మూసీ నది హైదరాబాద్ నగరం నుంచి కృష్ణానదిలో కలిసే వరకు పరిశుభ్రంగా ఉండాలని.., అందులో స్వచ్ఛమైన నీరు ప్రవహించాలని.. ఆ నీరు రైతులకు సాగునీటి కోసం ఉపయోగపడాలని తమ పార్టీ కోరుకుంటోందని తెలిపారు. అయితే ఈ అంశంపై కాంగ్రెస్ నేతలు పదే పదే తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి కానీ, మంత్రి పొన్నం ప్రభాకర్ కానీ.. బీజేపీపై రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కానీ మూసీ విషయంలో బీజేపీ వైఖరి మొదటి నుంచీ ఒకటేనని గుర్తు చేశారు.

# పేదల ఇండ్లపై బుల్డోజర్లతో యుద్ధం




హైదరాబాద్, మార్చి13 నిర్భవార్త ప్రతినిధి : ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంలో బాంబులతో ఇండ్లు కూలిపోతుంటే.. ఇక్కడ రేవంత్ రెడ్డి సర్కార్ పేదల ఇండ్లపై బుల్డోజర్లతో యుద్ధం చేస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మూసీ సుందరీకరణకు తామెప్పుడూ వ్యతిరేకం కాదని స్పష్టంచేశారు. తెలంగాణ భవన్‌లో హరీశ్ రావు మాట్లాడుతూ 'రేవంత్‌రెడ్డికాదు.. గోబెల్స్ రెడ్డి. మూసీ సుందరీకరణ ముసుగుల రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నరు. మూసీ ప్రాజెక్టుకు డీపీఆర్ సిద్ధం చేశారా?.. చేస్తే ప్రజల ముందు పెట్టాలి. కనీసం డీపీఆర్ లేకుండా పేదల ఇళ్లు కూల్చడానికి ఎందుకు సిద్ధమయ్యారు? డీపీఆర్ రూపొందించడానికి 18 నెలల పడుతుందని 2 నెలల క్రితం చెప్పారు. డబ్బులే లేవంటున్న సర్కారు రూ.1.50లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ అంటోంది. మూసీ ప్రాజెక్టు కోసం ఇప్పుడు 10 వేల 17 ఇండ్లు కూలగొడతామని ఆర్డర్ ఇచ్చారు. మూసీని శుద్ధి చేసేందుకు 3,279 ఎకరాలు భూమి ఎందుకు? లక్షలాది మంది జీవితాలను మూసీలో ముంచేస్తారా? మూసీ బ్యూటీఫికేషన్ పేరుతో లూటీఫికేషన్ చేస్తున్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలో రైతులు, పేదలు, మహిళలు, విద్యార్థులు లేరు' అని ఆరోపించారు.

# గ్యాస్ కొరతతో పెరుగుతున్న సైబర్ నేరాలు..
## అప్‌డేట్ పేరుతో రూ.4 లక్షలు కోల్పోయిన ఇద్దరు మహిళలు



ముంబై, మార్చి 13 నిర్భయవార్త: వంట గ్యాస్ కొరత నేపథ్యంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. సైబర్ నేరగాళ్లు అప్‌డేట్ పేరుతో ఇద్దరు మహిళలను మోసగించారు. వారి బ్యాంకు ఖాతాల నుంచి రూ.4 లక్షలు కొల్లగొట్టారు. ఫిర్యాదులు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మహారాష్ట్రలోని థానే జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కల్యాణ్–డోంబివ్లి ప్రాంతానికి చెందిన ఇద్దరు మహిళలను సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేశారు. గ్యాస్ కొరత నేపథ్యంలో మహానగర్ గ్యాస్ లిమిటెడ్ డిస్ట్రిబ్యూటర్ సంస్థ ప్రతినిధుల పేరుతో వారికి ఫోన్ చేశారు. గ్యాస్ సిలిండర్ కనెక్షన్ సమాచారం అప్‌డేట్ చేసుకోవాలని చెప్పారు.

నిర్భయవార్త
సంపాదకీయం
శనివారం 14, మార్చి 2026

# ఊచకోత!

కొత్త నేస్తరికం కుదిరినంత మాత్రాన, పాతది ఒదిలేస్తామేటి? అతగాడు ఒకందుకు పువ్వులిసిరినాడు! మనం ఒకందుకు నవ్వులిసిరినామూ! కౌగిలించుకున్నంత మాత్రాన కడుపు మంట సల్లారిపోతాదేటీ? అలాగైతే మన మోడీ గారు ఎన్ని ఎయిర్ పోర్టుల్లో ఎందరిని కౌగిళ్లలో బిగించేసినాడు? అందులో ఎంతమందికి ఆయనంటే ఇష్టం? ట్రంపుని కౌగిలించీసి, పుతిన్నీ కౌగిలించేస్తే అనుకున్న పనులు అయిపోతాయేటి? ఎవరి ఫీలింగ్సు ఆలకుంటాయి!"పరదేశి మొహం మాత్రం ఇంకా, రెండ్రోజుల క్రితం రాలిపోయి, ఎండకు కమిలిపోయిన సింహాచలం సంపంగి పువ్వులాగే ఉంది."ఐనా, మనం నేస్తాలమేట్రా మోడీ, అమిత్ షా జోడీలాటోళ్లం"– ఆ మాటకు ఉబ్బితబ్బిబ్బయి అలక మానేస్తాడని అనుకున్నాడు నాయుడు."అంత రేంజి మనకు లేదులే! నువ్వు నిటారు సెట్టు లాటోడివీ.. నేను నిన్ను అల్లుకొని బతుకుతున్న మిరియాల తీగలాటోడ్ని!"– పాదాల మీద పడి, వల, వలా ఏడ్చాడు పరదేశి.నాయుడు మనసు పొయ్యి మీద జంతు కొవ్వు లేని నెయ్యి లాగా కరిగిపోయింది."నేనెప్పుడో సెప్పాను. మనం ఒక తల్లికి పుట్టకపోయినా, అన్నదమ్ములమని"– తల నిమిరి ఓదార్చాడు నాయుడు.ఆ మాటకు, ప్రజలు లేకుండా ప్రజాభిప్రాయ సేకరణ సజావుగా జరిగిపోయినట్టు అధికారులు తయారుచేసిన రిపోర్టు చదివిన మైనింగ్ కాంట్రాక్టర్ మనసులా తేలికయింది. లేచి నాయుడు సోఫా అంచుకు చేరబడి– "సర్లే అన్నా! జరిగింది మర్సిపోదుం..మన పెదబాబు మనుసులో, మన పవను బాబుకి ఉన్నంత జాగా నాకుంది. బాగా నమ్మకమైంది""ఏదో ఆశించి కొత్తగా కలిసినోళ్లు ఎన్నాళ్ళుంటార్ర? అవసరాల నేస్తరికాలు పట్టు దారాల్లాంటివి! ఎప్పుడు పుటుక్కున తెగిపోతాయో, సెప్పలేం! మన కోడి రామ్మూర్తి నాయుడు ఒకప్పుడు అల్లిన గునపాల జడలాటోల్లం మనం.. ఎవుడు ఇడదీసీగలడు? ఓసీ!!"ఆ మాటకి ఫుల్ ఖుషీ అయిపోయాడు పరదేశి."అన్నా! ఆ బుస్సీ గాడికి బుర్రలో ఈసమెత్తు తెలివి లేదు. ఇప్పుడేటి జరుగుతుంది మన మన్నెంలో!? జలపాతాలు, గెడ్డలకు అడ్డంగా డ్యాములు కట్టీసి, కరెంటు తయారీకి పెద్ద, పెద్ద కంపెనీలకి స్టేటూ, సెంటరు గవర్నమెంట్లే సాయం చేసేసీయి గదా! పెర్మిషన్లు ఎవరిని అడిగి ఇచ్చేసినారు? ప్లైయిన్ ఏరియా వాళ్ళం...ఏజెన్సీలో ఒక హోటేలో ..లాడ్జో.. ఒకపక్కా దుకాణమో.. కట్టుకుందమంటే వన్ బై సెవింటీ ఏక్టూ.. కుదరదంటారు. ఎండిపోయిన పుచ్చిసెట్లను కొట్టుకుని, యాపారం చేద్దామన్నా గ్రామసభ తీర్మానం, పీసా అంటారు."అవున్రా! ఆ నీటి కరెంటు కంపెనీలోళ్ళు మామూలోళు కారట! డయిరక్ట్ పిఎం, సిఎంలతోనే డీలింగ్సట! ఎమ్మెల్యేలు, ఎంపీలే ఆళ్లకి ఏజెంట్లయిపోతే మనలాటోలకి దారేది!?""ఇప్పుడు, ఇక్కడ మన రెండు బుర్రలు ఒకటై డీప్‌గా ఆలోసించాల! అనువు గాని సోట అదికుల మనరాదు.అడివీ, కొండా కొట్టీసిన తర్వాత వానలుండవూ.. వరదలుండవు. మనం ఒకసారి సెర్చించుకున్నాం.. పులులు తిని ఎల్లిపోయిన తర్వాత, మిగిలింది నక్కలు పీక్కుతున్నట్టు ..అలాగా ఎళ్ళిపోదాం..ఎన్నాళ్లు సాగితే అన్నాళ్లు.. ఎద్దు ఎప్పుడు ఒకపక్కే తొంగుంతాదేటి? కాలమంతే!""ఏం కాలం రా! మన మన్యానికి పోయే కాలంలా ఉంది.""ఇప్పుడు లాటరయిటోళ్లు, కంకరరాయోళ్లు, కలప కొట్టుకున్నోళ్ళు,రంగు రాయోళ్లూ– ఈళ్లే గదా, మన రాబడి. ఆఫీసర్లు.. ఉజ్జోగస్తులు కోపరేషన్తో సాటుమాటుగా ఆపరేషన్లన్నీ డీల్ చేసేస్తున్నాం. ఇవన్నీ మిడిల్ క్లాసోళ్ళవి కాబట్టి, మనం సెయగలుగుతున్నాం. మరి హైక్లాసోలు ఒచ్చీస్తే! మన పరిస్థితి ఏటి?""అలగెలగయిపోద్దిరా! ఆళ్లు ఎలాగ దూరిపోతారు? మన గిరిజన్స్ సంగతి తెలీదా? ఎన్నో ఏళ్ల నుంచి ఏజెన్సీ జోలికి రాకుండా అడ్డుతున్నారు""అన్నా! నీకు అర్థమవడం లేదు.. లేటరయిటు మయినోడు నాటుబాంబులాటోడు. బాక్సయిటోడు ఒస్తే లాండ్ మైన్ లాటోడు! పర్వతాలనే పేల్చేస్తాడు.. ఏజెన్సీలో ఏటి మిగలనేస్తాడేటీ!?""ఈ కరెంట్ కంపెనీవోళ్ళకే బాక్సైట్ ఇచ్చేస్తారంటావా?""ఎంత అమాయకుడివన్నా! ముందు, కరెంట్ కంపెనీలు పేరుతో కాలెట్టడానికి గెడ్డల దగ్గర, జలపాతాల దగ్గర గేట్లు ఎత్తీసినారు. తర్వాత్తర్వాత ఆలే పర్వతాలెక్కేస్తారు. ఈ వేళ ఈతపండు ఇసురుతారు! రేపు తాటిపండు లాగేస్తారు!! బాక్సయిటు తవ్వకానికి పరిమిషన్లు తెచ్చుకుంటారు.. కొండా కోన కొట్టి బారేస్తారు.""అప్పుడు మనకేటి మిగులుద్ది..బుగ్గి!?""అదీ మిగలదూ! ఆ మద్దిన రాయలసీమలో బుగ్గి కోసం కూటమి నాయకుల కొట్లాటలు మర్సిపోనావేటీ?"మరి ప్రెజలు కాలిపోయిన ఫీజుల్లాగా, తెగిపోయిన తీగెల్లాగా, కిర్సనూన లేని బుడ్డీల్లాగా..అలాగే ఉండిపోతారేటి?""ఆల సంగతి ఆలగుంచు.. మన సంగతేటి? జనరేటరు ఎల్తురు ఎన్నాళ్ళు? దీనికీ ఆయిలు పొయ్యాలా? ఎక్కడ తెస్తాం? అసలే ప్రెపంచంలో ట్రంపు కంపు!"కొంతసేపు నాయుడు మౌనమయ్యాడు. ఈలోగా కరెంటు పోయింది. ఎ.సి.బి రెయిడ్‌లో దొరికిపోయిన పెద్దాఫీసర్లాగా ఫ్యాను బద్ధకంగా కదిలి, కదిలి ఆగిపోయింది. విసుగొచ్చి–"ఈ మద్దిన..రూరల్‌కి కరెంటు కోతలు ఎక్కువైపోనాయి. ఆ నీటి కరెంటు కంపెనీలొస్తే మన ఏరియాకి ఈ కోతలు మరి ఉండవేమో!""పురాణమంతా విని, పుసుక్కున ఒక ముక్కా బుర్రకెక్కలేదన్నాడటఎనకటికొకడు! అవునవును.. కోతలుండవు..ఊచకోతలే!"– లేచి, విస, విసా నడుచుకుంటూ, బయిటకెల్లిపోయాడు పరదేశి.

# చెల్లాచెదురుగా వున్న ప్రజాగ్రహాన్ని ఐక్యం చేద్దాం



మార్చి 24న దేశం నలుమూలల నుండి ముఖ్యంగా హిందీ భాషా రాష్ట్రాల నుండి సిపిఐ(ఎం) నాయకత్వాన కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు, విద్యార్థులు, యువజనులు దేశ రాజధాని నగరం ఢిల్లీలో 'జన్ ఆక్రోష్' పేరిట నిర్వహించ తలపెట్టిన ర్యాలీ విశాల ఐక్య సింహనాదానికి తార్కాణం. ఉత్తరాది రాష్ట్రాలలో జమ్ముకాశ్మీర్ నుండి జార్ఖండ్ వరకు ప్రతి జిల్లాలో, ప్రతి తాలుకాలో, ప్రతి బస్తీలో ప్రతిఘటనా పోరాట వెల్లువను నిర్మిస్తూ సాగిన రాష్ట్ర వ్యాప్త జాతాల ముగింపు సందర్భంగా ఈ ర్యాలీ నిర్వహించాలి. ఈ జాతాలు మొక్కుబడి కార్యక్రమాలు కాదు. ప్రజలు సమరశీల పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను...మోడీ నాయకత్వం లోని ప్రభుత్వం ధ్వంసం చేస్తూ...ప్రజాస్వామ్యాన్ని డొల్ల చేస్తున్నది. ఈ నేపథ్యంలో వివిధ తరగతుల ప్రజానీకంలో చెదురుమదురుగా నెలకొని ఉన్న ఆగ్రహావేశాలను వర్గ పోరాటాల దిశగా మళ్ళించాలనే ఉద్దేశంతో పార్టీ చైతన్య పూర్వకంగా చేపట్టిన కృషి ఇది.కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భారత ప్రజానీకం మీద అనేక విధాలుగా దాడులకు పాల్పడుతున్నది. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను నిర్బంధంగా రుద్దడం, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని దెబ్బతియ్యడం, విద్యుత్, వ్యవసాయం వంటి కీలక రంగాలను బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం, దేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టి అమెరికన్ సామ్రాజ్యవాదంతో అసమరీతి వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడం వంటివన్నీ ఈ కోవకు చెందినవే. ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై విడివిడిగా సాగుతున్న పోరాటాలను ఒకే రాజకీయ పోరాటంగా మలచడానికి ఉద్దేశించినదే మార్చి 24న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్ వద్ద జరిగే ర్యాలీ. ఈ ర్యాలీకి ముందుగా జరిగిన రాష్ట్ర వ్యాపిత జాతాలు...మతతత్వ కార్పొరేట్ శక్తులు ఉమ్మడిగా చేపట్టిన 'సోకాల్డ్' సంస్కరణల వర్గ స్వభావాన్ని బట్టబయలు చేసి...ప్రజలకు అర్థమయ్యేలా చెప్పే మొబైల్ రాజకీయ పాఠశాలలుగా, ఉద్యమ కేంద్రాలుగా పని చేశాయి. ఈ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి పార్టీ సభ్యుడూ మన పార్టీ రాజకీయ విధానాన్ని ప్రజానీకానికి తెలియచెప్పే బోధకుడిగా, నిర్మాణదక్షుడిగా, ఆందోళనకారుడిగా వ్యవహరించారు.ఉపాధి హామీ చట్టం రద్దుప్రజల హక్కుల మీదా, రాజ్యాంగం మీద దాడి 2005లో నాటి యుపిఎ ప్రభుత్వం మీద వామపక్షాలు, ముఖ్యంగా సిపిఎం ఒత్తిడి తీసుకువచ్చి మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని చట్టంగా రూపొందించడం ద్వారా రాజ్యాంగంలో పొందుపరిచిన పని హక్కును పాక్షికంగానైనా అమలయ్యేలా చేశాయి. ఈ చట్టం మూలంగా గ్రామీణ ప్రాంత ప్రజానీకం ఒక డిమాండ్‌గా వంద రోజుల పని సాధించుకున్నారు. ఇందుకయ్యే వ్యయం మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించేది. దేశ వ్యాప్తంగా వ్యవసాయ సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో కోట్లాది మంది గ్రామీణ ప్రాంత ప్రజానీకానికి ముఖ్యంగా మహిళలు, దళితులు, ఆదివాసులకు ఈ పథకం జీవనాడిగా అంది వచ్చింది.మోడీ ప్రభుత్వం 2025లో తీసుకొచ్చిన వి.బి గ్రామ్‌జి పథకం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్వభావాన్నే పూర్తిగా నీరుగార్చేసింది. గతంలో ప్రజలు డిమాండ్ చేస్తే ఉపాధి కల్పించే పరిస్థితి పోయి మోడీ తీసుకువచ్చిన పథకంతో ఢిల్లీ పెద్దలు కేటాయించే నిధులను బట్టి ఉపాధి దొరికే పరిస్థితులు ఎదురుకానున్నాయి. ఇప్పటికే పన్ను వసూళ్ళలో రాష్ట్రాలకు అందాల్సిన న్యాయమైన వాటాలు చెల్లించకుండా రాష్ట్రాలను ఆర్థికంగా ఎండగడుతున్న మోడీ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన వి.బి. గ్రామ్‌జి పథకం అమలుకయ్యే ఖర్చులో 40 శాతం రాష్ట్రాలు భరించాలని మెలిక పెట్టింది. ఉపాధి పనుల కేటాయింపులో పంచాయతీలకు ఉండే అధికారాలపై కోత పెట్టింది. ప్రజాస్వామిక ప్రణాళికలు రూపొందించుకునే హక్కును కాలరాసి కేంద్రీకృత డిజిటల్ నియంత్రణ కిందకు తీసుకొచ్చింది. వ్యవసాయ పనుల సీజన్‌లో ఈ పథకం అమలును స్తంభింపచేయడం ద్వారా గ్రామీణ ప్రాంత ధనిక రైతాంగం వ్యవసాయ కార్మికుల శ్రమశక్తిని కారుచౌకగా దోచుకునే వర్గ పక్షపాతంతో కూడుకున్న పథకం ఇది. అంతేకాదు, రాజ్యాంగంలో పొందుపరిచిన ఆదేశిక సూత్రాలు, సమాఖ్యతత్వంపై ప్రత్యక్ష దాడికి ఉద్దేశించినది ఈ పథకం. ఈ అధికార చౌర్యం మూలంగా నిరుద్యోగం మరింత తీవ్రతరమై వలసల పెరుగుదలకు దారితీస్తుందని, గ్రామీణ ప్రాంత పేదలు తిరిగి భూస్వాముల, వడ్డీ వ్యాపారుల విషపు కోరలకు బలికావాల్సి వస్తుందని ప్రజలకు తెలియచెప్పాలి.లేబర్ కోడ్‌లు: ఇష్టారాజ్యంగా పనిలో పెట్టుకోవడం, తీసేయడం, ప్రతిఘటనను నేరపూరితంగా మార్చడం మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక రూపొందించుకున్న అనేక చట్టాలను సమూలంగా మార్చేసి నాలుగు లేబర్ కోడ్‌లు రూపొందించారు. దశాబ్దాల పోరాట ఫలితంగా కార్మికులు సాధించుకున్న హక్కులను, రక్షణలను నీరుగార్చి కార్పొరేట్ రంగం మరిన్ని లాభాలు పోగేసుకోవడానికి వీలు కల్పించేవి. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా గుదిగుచ్చి యజమానులు ఇష్టారాజ్యంగా కార్మికులను పనిలో పెట్టుకోవడానికి, తీసేయడానికి, ఏకపక్షంగా పరిశ్రమలను మూతపెట్టుకోవడానికి, రిట్రెంచ్‌మెంట్ చేయడానికి వెసులుబాటు కల్పించారు. సామాజిక భద్రతను నీరుగార్చారు. యూనియన్ పెట్టుకోవడం, సమ్మెలు నిర్వహించడం చట్టవిరుద్ధమైన చర్యలుగా మార్చేశారు. గతంలో వంద మంది కార్మికులు పని చేసే ఏ పరిశ్రమైనా, సంస్థ అయినా మొదలుపెట్టాలంటే ముందుగా వివిధ ప్రభుత్వ అనుమతులు పొందాలి. ఇప్పుడు 300 మంది కార్మికులున్న సంస్థలకే ఈ ముందస్తు అనుమతులు అవసరమని మార్పు చేయడం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో పని చేసే కార్మికుల ఉద్యోగ భద్రతకు గండి కొట్టింది. కార్మిక చట్టాల రక్షణకు దూరం చేసింది. లక్షలాది మంది కార్మికులను అసంఘటిత రంగ కార్మికుల జాబితాలోకి నెట్టేసింది. యూనియన్లు రిజిష్టర్ చేయించుకోవడానికి కఠినమైన షరతులు విధించడం, యూనియన్లపై రాష్ట్రాలకు ఏకపక్ష అధికారాలు కల్పించడం, సమ్మె చేయాలనుకుంటే ముందస్తు నోటీసు ఇవ్వడం అన్ని సంస్థల్లో తప్పనిసరి చేయడం, తగిన నోటీసు ఇవ్వని పక్షంలో అలాంటి సమ్మెలు చేసిన వారి మీద భారీ జరిమానాలు, జైలు శిక్ష విధించే అవకాశం కల్పించడం ఇవన్నీ కార్మిక సంఘాల పీక నులమడానికి ఉద్దేశించినవే. కనీస వేతనాలు చెల్లించకపోయినా, సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోయినా గతంలో యాజమాన్యం మీద క్రిమినల్ చర్యలు చేపట్టే అవకాశం ఉండింది. ప్రస్తుతం అందుకు అవకాశం లేకుండా చేసి యాజమాన్యాల కొమ్ము కాస్తున్నాయి ఈ లేబర్ కోడ్‌లు. లేబర్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలను తూతూ మంత్రంగా మార్చేశాయి. యజమానులు సొంతంగా ఇచ్చే డిక్లరేషన్‌లు స్వీకరించడం తప్ప తనిఖీలు, ఉల్లంఘనలకు జరిమానాలు విధించే అధికారాలను కత్తిరించేశారు. కార్మికులను ఒంటరిపాటు చేసి, ఉమ్మడి బేరసారాల హక్కును అణచివేసి, వారి జీతభత్యాల్లో కోత పెట్టడానికి వీలు కల్పించి స్వదేశీ, విదేశీ పెట్టుబడులకు ఊడిగం చేయించడమే లేబర్ కోడ్‌ల లక్ష్యం. కాబట్టి మార్చి 24 ర్యాలీకి సన్నాహకంగా... మూతపడిన పరిశ్రమలు, ప్రమాదాలకు గురైన ప్రతి పరిశ్రమలోని దుస్థితిని కొత్తగా అమలు కానున్న లేబర్ కోడ్‌లతో కలిపి కార్మికులందరూ అర్థం చేసుకునేలా ప్రచారం చేపట్టాలి. విత్తన, విద్యుత్, విద్యా బిల్లులు రైతుల, ప్రజల ప్రయోజనాలు, విజ్ఞానాలను అమ్మకానికి పెట్టడం మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విత్తన బిల్లు మన దేశ రైతాంగ ప్రయోజనాలను దెబ్బతియ్యడంతోబాటు సుదీర్ఘకాలంగా విత్తుని పండించి మరల మరల నాటుకునేలా మన రైతులకున్న హక్కును హరించివేస్తుంది. విత్తనాల రిజిస్ట్రేషన్, నాణ్యతా ప్రమాణాల మీద కార్పొరేట్ కంపెనీలకు నియంత్రణ కట్టబెట్టడమంటే అది చిన్న సన్నకారు రైతులను దెబ్బతీయడమే. విత్తన రంగంలో మన దేశానికి వున్న సార్వభౌమాధికారాన్ని బహుళజాతి, విదేశీ కంపెనీలకు కట్టబెట్టడమే. ఆలిండియా కిసాన్ సభ తదితర రైతు సంఘాలు ఈ ప్రమాదాన్ని సరిగానే పసిగట్టాయి. మన దేశ విత్తన సార్వభౌమాధికారాన్ని, రైతాంగ జీవనోపాధిని, మన దేశ ఆహార భద్రతను దెబ్బ తీసే ఈ బిల్లు ప్రమాదం గురించి విస్తృతంగా ప్రచారం సాగాలి. ప్రతిపాదిత 'ముసాయిదా విద్యుత్ బిల్లు 2025' విద్యుత్ ఉత్పాదన, పంపిణీ రంగాలను ప్రైవేటీకరించే క్రమాన్ని వేగవంతం చెయ్యడానికి, సబ్సిడీల ఉపసంహరణకు, విద్యుత్ చార్జీల పెంపునకు దారితీస్తుంది. దేశీయ వినియోగదారులు, రైతుల మీద మరిన్ని భారాలు మోపుతుంది. విద్యుత్ రంగంలో చేపట్టనున్న ఈ సంస్కరణలు ప్రభుత్వ రంగ విద్యుత్‌ను బలహీన పరుస్తాయని, ప్రజలకు విద్యుత్‌ను పొందే సార్వజనీన హక్కును హరించి వేస్తాయని, లాభాలను ఆర్జించే కీలక మౌలిక సౌకర్యాలను ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని సిఐటియు తదితర విద్యుత్ రంగ కార్మిక సంఘాలు సరిగానే అంచనా వేశాయి. ఈ అంశాలను ప్రజలలో విరివిగా ప్రచారం చెయ్యాలి. ఇక 'హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా' (హెచ్.ఇ.సి.ఐ) పేరిట మోడీ ప్రభుత్వం తీసుకు వచ్చిన బిల్లు ఉన్నత విద్యా రంగాన్ని కాషాయీకరించి కేంద్రీకృత నియంత్రణ ద్వారా విద్యను వ్యాపారంగా మార్చడానికి ఉద్దేశించినదేనని స్పష్టమవుతున్నది. ఉన్నత విశ్వవిద్యాలయా ల్లో సునిశితమైన విమర్శ, ప్రజాస్వామిక వాతావరణాన్ని దెబ్బతియ్యడమే ఈ బిల్లు లక్ష్యం. ఇప్పటికే జె.యన్.యు లో మనం అలాంటి పరిణామాలను చవిచూస్తున్నాం. ఈ బిల్లు రాష్ట్రాలు నిర్వహిస్తున్న ఉన్నత విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిని హరించివేస్తుంది. ఫీజుల పెంపునకు దారితీస్తుంది. ప్రైవేటు పెట్టుబడులను అనుమతించడం ద్వారా ఉన్నత విద్యను వ్యాపారంగా మార్చేస్తుంది. మతతత్వ, మార్కెట్ అనుకూల భావజాలాన్ని పెంచేవిధంగా కరికులమ్‌లో మార్పులు తీసుకువస్తున్నారు.ప్రైవేటు విశ్వవిద్యా లయాల బండారం ఏమిటో ఢిల్లీలో తాజాగా జరిగిన ఎ.ఐ సదస్సులో బట్టబయలైంది. మన పార్టీ నిర్వహించే జాతాలు వివిధ తరగతుల ప్రజానీకం రోజువారీ జీవితంలో ఎదుర్కొంటున్న విద్యుత్ చార్జీల భారం, ఫీజుల భారం వంటి అంశాలతో పాటు రైతాంగ కుటుంబాల మీద పడుతున్న భారాలు, పెరుగుతున్న రైతుల బలవన్మరణాలు, విశ్వవిద్యాలయాల్లో అసమ్మతి గళాల అణచివేత తదితర సమస్యలను ఎదుర్కొనే ప్రజానీకాన్ని సమన్వయ పరిచే వేదికలుగా పనిచేయాలి. ఇండో–అమెరికా వాణిజ్య ఒప్పందం సార్వభౌమాధికారం తాకట్టు ఇండో–అమెరికా వాణిజ్య ఒప్పందం మన దేశ సార్వభౌమాధికారాన్ని అమెరికన్ సామ్రాజ్యవాదానికి బాహాటంగా పాదాక్రాంతం చేయడానికి తార్కాణం. అమెరికా దిగుమతి చేసే పండ్లు, పత్తి, సోయా నూనె తదితర వ్యవసాయ ఉత్పత్తుల మీద సున్నా సుంకాలు విధించడమంటే మన దేశ లక్షలాది రైతాంగ కుటుంబాల జీవనోపాధిని దెబ్బతియ్యడమే. మన దేశ ఆర్థిక, వ్యూహాత్మక విధాన నిర్ణయాలను ఇవాళ అమెరికా శాసిస్తుందనడానికి రష్యాతో చమురు కొనుగోళ్ల అంశం ఒక్కటి చాలు. మోడీ ప్రభుత్వం అమెరికన్ సామ్రాజ్యవాదానికి నిస్సిగ్గుగా తలవంచింది. ట్రంప్ మన దేశం మీద విధించిన సుంకాలకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించనేలేదు. అమెరికా సుప్రీంకోర్టు ట్రంప్ విధించిన సుంకాలను రద్దు చేస్తూ తీర్పు వెలువరించినా మోడీ ప్రభుత్వం మన దేశ సార్వభౌమాధికారాన్ని నిలబెట్టుకునేందుకు దీటైన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా లేదు. ఈ ఒప్పంద వివరాలు పార్లమెంటు ముందుంచడానికి ప్రభుత్వం నిరాకరించి ప్రజాస్వామ్యాన్ని, ప్రజల హక్కులను పరిహాసం పాల్జేసింది. అందుకే ఈ ఒప్పందం వివరాలను 'జన్ ఆక్రోశ్' జాతాలు ప్రజలకు వివరించాలి. అమెరికన్ సామ్రాజ్యవాద శృంఖలాలలో చిక్కుకుపోవడం ద్వారా మోడీ ప్రభుత్వం మన దేశ కార్మికుల, కర్షకుల ప్రయోజనాలను స్వావలంబనను ఎలా తాకట్టు పెడుతున్నదో ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలి. విదేశాంగ విధానం అలీనోద్యమం నుండి లొంగుబాటు దిశగా పయనం మన దేశ సామ్రాజ్యవాద వ్యతిరేక వారసత్వాన్ని, పాలస్తీనా ప్రజల పట్ల సంఘీభావాన్ని వదిలిపెట్టి అమెరికన్ సామ్రాజ్యవాదం, జాత్యహంకార ఇజ్రాయిల్‌తో చెట్టాపట్టాలు వేసుకు సాగే విదేశాంగ విధానాన్ని ఎంచుకున్నది మోడీ ప్రభుత్వం. గాజాలో ఇజ్రాయిల్ జాతి హత్యాకాండకు పాల్పడి, కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. తిరిగి గాజా, వెస్ట్‌బ్యాంక్‌ల మీద వైమానిక దాడులకు తెగబడుతున్న నేపథ్యంలో ప్రధాని హోదాలో మోడీ ఆ దేశాన్ని సందర్శించారు. అంటే చారిత్రకంగా పాలస్తీనా ఇస్తున్న మద్దతును విడనాడి అమెరికా–ఇజ్రాయిల్ వ్యూహాత్మక ప్రయోజనాలతో షరీకవడం మినహా మరొకటి కాదు. ఇండో–అమెరికా వాణిజ్య ఒప్పందం ఈ లొంగుబాటుకు కొనసాగింపే. పశ్చిమాసియా లో అమెరికా–ఇజ్రాయిల్ కవ్వింపు దాడులకు పూనుకోవడం, ఇరాన్ అత్యున్నత నాయకత్వాన్ని హత్యగావించడం వంటి దేశానికి తలవంపులు తెచ్చిపెట్టింది.

# పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎటువంటి ఆందోళన పెట్టుకోకుండా పరీక్షలు రాయండి..: ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్



భద్రాచలం 13 మార్చి నిర్భయ వార్త ప్రతినిధి. : గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల, గురుకులాలు, వసతి గృహాలు, బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థిని, విద్యార్థులు మనసులో ఎటువంటి భయాందోళనలు పెట్టుకోకుండా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను ధైర్యంగా ఏకాగ్రతతో మనసు పెట్టి ప్రత్యేక దృష్టి సారించి పరీక్షలు బాగా రాసి, ఏ గ్రేడ్ లో పాస్ కావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన విద్యార్థిని విద్యార్థులు పరీక్షలు మంచిగా రాస్తే మీకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, మనస్ఫూర్తిగా బెస్ట్ విషెస్ తెలియజేస్తున్నానని ఆయన అన్నారు. శనివారం నుండి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు విషెస్ తెలియజేస్తూ, ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసే ఈ పరీక్షలు మీరు ప్రశాంతంగా వ్రాసేందుకు సంబంధిత హెచ్ఎం, ఉపాధ్యాయులు అన్ని ఏర్పాట్లు చేశారని, విద్యార్థులు ఎలాంటి ఒత్తిళ్లకు గురి కావద్దని, భయపడవద్దని, నిర్భయంగా ధైర్యంగా పరీక్షలు రాయాలని, ఈ పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితానికి మైలురాయని, ఈ మైలురాయిని అధిగమించడానికి మీరు ఎంత దృఢంగా నిలబడతారో మీ ఉజ్వల భవిష్యత్తుకు ఆధారపడి ఉంటుందని, విద్యార్థులు ఈ పరీక్షల సమయంలో ధైర్యంతో ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయడం ద్వారా విజయం సాధిస్తారని, పరీక్షల్లో విజయం సాధించడానికి ప్రణాళికబద్ధంగా చదివి, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పరీక్షలు అంటే భయపడకుండా అన్ని ప్రశ్నలకు స్పష్టంగా సమాధానాలు రాయాలని, మానసిక ఒత్తిడిని అధిగమించి, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు 56, వసతిగృహాలు 21, గురుకులాలు 12, బెస్ట్ అవైలబుల్ పాఠశాలలు 03, మొత్తం 92 ఇన్స్టిట్యూషన్లలో 3628 మంది 10వ తరగతి గిరిజన విద్యార్థిని విద్యార్థులు పరీక్షలు వ్రాస్తున్నారని ఇందులో బాలురు 1689 బాలికలు 1939 కలిపి 3628 మంది పిల్లలు పరీక్షలకు హాజరవుతున్నారని, అందుకు సంబంధిత ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, విద్యార్థినీ విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరవేసే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పిల్లల వెంట పరీక్షా కేంద్రాలకు తీసుకెళ్లడానికి ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని,విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించి ఎంతో ప్రతిష్ఠాత్మకమైన పరీక్షల్ని ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పగడ్బందీగా నిర్వహించాలని, పరీక్షలు జరుగు సమయంలో వైద్య సిబ్బంది ప్రతి పరీక్షా కేంద్రంలో అందుబాటులో ఉండాలని,పారిశుద్ధ్యం, త్రాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం,తప్పనిసరిగా ఉండాలని, విద్యార్థిని విద్యార్థులు అస్వస్థతకు గురి అయితే తగినన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని, ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కు ఆస్కారం లేకుండా ప్రశాంతంగా పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించి ఐటీడీఏకు మంచి పేరు తేవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పిల్లలందరూ ఎటువంటి భయం లేకుండా, ఒత్తిడికి గురికాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పరీక్షలు బాగా రాసి నూరు శాతం ఫలితాలు సాధించి రాష్ట్రంలోని ఐటీడీఏల కంటే భద్రాచలం ఐటీడీఏ లోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించి అగ్రస్థానంలో నిలపాలని ఆయన తెలుపుతూ పరీక్షలు రాస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు మనస్ఫూర్తిగా దీవిస్తున్నానని ఆయన తెలిపారు.

# ఘనంగా రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకుడు జన్మదిన వేడుకలు

## ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి హాజరు పలువురు కాంగ్రెస్ నాయకుల సందడి







శామీర్ పేట్, నిర్భయవార్త ప్రతినిధి: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ కుమారుడు, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకుడు నక్క సందీప్ గౌడ్ జన్మదిన వేడుకలు మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని శామీర్‌పేట్ మండలంలోని ఎన్‌పిజి డ్రీమ్ వ్యాలీ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సందీప్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలకు రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు మహమ్మద్ ముజీబుద్దిన్, జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేశ్, మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, శామీర్‌పేట్ మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు యాష్కీ శంకర్ గౌడ్, మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. వేడుకల సందర్భంగా నక్క సందీప్ గౌడ్‌ను నాయకులు, కార్యకర్తలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ జన్మదిన వేడుకలలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఆలయాల చైర్మన్లు, ధర్మకర్తలు, పలువురు కౌన్సిలర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, మాజీ వైస్ చైర్మన్లు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, మండలాల మాజీ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యకర్తలు, యువకులు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నక్క సందీప్ గౌడ్ యువ నాయకుడిగా ప్రజాసేవలో ముందుకు సాగుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

# కామేపల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి

కామేపల్లి/ఖమ్మం మార్చి-13 నిర్భయవార్త రిపోర్టర్. మార్చి చివరి నాటికి రాష్ట్రంలో లక్ష ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం కామేపల్లి మండలంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జాస్తిపల్లి గ్రామంలో 3 కోట్ల 15 లక్షలతో జాస్తిపల్లి నుండి కెప్టెన్ బంజర రోడ్డు వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, లాల్యతండ గ్రామంలో 3 కోట్ల 33 లక్షలతో లాల్యతండ ఆర్ అండ్ బి రోడ్డు నుండి జగన్నాథ తండ వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, ఊటుకూరు గ్రామంలో ముత్యాలంపాడు గుడి నుండి శ్మశాన వాటిక వరకు కోటి 80 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, తాళ్ళగూడెంలో ఆర్ అండ్ బి రోడ్డు నుండి డోర్నకల్ ఆర్ అండ్ బి రోడ్డు వయా టేకులతండ, పింజరిమడుగు, పాతలింగల మీదుగా 4 కోట్ల 20 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. దీంతో పాటు ముచ్చర్ల, పింజరమడుగు గ్రామాల్లో నిర్మించిన రెండు పడక గదుల నిర్మాణాలను ప్రారంభించి, లబ్ధిదారులకు ఇళ్ల పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత పాలకులు వైఎస్సార్ హయాంలో కట్టించిన ఇందిరమ్మ ఇండ్లను అవహేళన చేస్తూ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు నిర్మిస్తామని హామి ఇచ్చి 2 పర్యాయాలు అధికారంలోకి వచ్చి ఇండ్లు



కట్టకుండా మోసం చేశారని మంత్రి మండిపడ్డారు. ముచ్చర్ల, పింజరమడుగు గ్రామాల్లో గత ప్రభుత్వం అసంపూర్తిగా ఉంచిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసామని అన్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇండ్లు కూడా నిర్మించ లేదని, తాము అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరమే 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. మార్చి చివరి నాటికి రాష్ట్రంలో లక్ష ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేస్తున్నామని మంత్రి ప్రకటించారు. రాబోయే ఏప్రిల్ నెలలో మరో విడత ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని అన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని తెలిపారు. పేదింటి మహిళలు ఇబ్బంది పడవద్దని ప్రభుత్వం సన్న బియ్యం, నూతన రేషన్ కార్డులు, 200 యూనిట్లు ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే కోరిన రోడ్డు ఏప్రిల్ నెలలో మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఊటుకూరు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేసి వర్షాకాలం నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం మంజూరు చేసి అసంపూర్తిగా ఉంచిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తి చేయాలని మంత్రి దృష్టికి తీసుకొని వెళ్లి ఇక్కడ ఉన్న విద్యుత్ సమస్య, ఇతర మౌలిక వసతుల సమస్యలు పరిష్కరించామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్, వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై చిరు వ్యాపారాలతో ట్రాఫిక్‌కు అంతరాయం

## ప్రజల భద్రత దృష్ట్యా రోడ్లకు కనీసం 10 అడుగుల దూరంలోనే వ్యాపారం చేయాలి: ట్రాఫిక్ ఎస్ హెచ్ ఓ నరసింహ



మల్కాజ్గిరి, నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: జెడ్ ఆర్టిసి, టీ జంక్షన్ కోకోకోలా కంపెనీ దగ్గర ప్రధాన రహదారుల వెంట ఇరువైపులా ఏర్పాటు చేస్తున్న చిరు వ్యాపారాలు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ వాహనదారులు, పాదాచారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని... ముఖ్యంగా సాయంత్రం నుండి రాత్రి వేళల్లో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండే సమయంలో రోడ్ల పక్కనే వ్యాపారాలు ఏర్పాటు కావడంతో ట్రాఫిక్‌కు ఆటంకం కలుగుతోందని అధికారులు తెలిపారు. రోడ్డుకు అతి సమీపంలో దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల అక్కడ కొనుగోలు చేసేందుకు వచ్చే వాహనదారులు తమ వాహనాలను రోడ్డుపై నిలిపివేయడం జరుగుతోంది. దీంతో ట్రాఫిక్ జాములు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ట్రాఫిక్ సీఐ



నరసింహ తెలిపారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ రోడ్లకు ఇరువైపులా కనీసం 10 అడుగుల దూరం పాటిస్తూ మాత్రమే వ్యాపారాలు నిర్వహించాలని సూచించారు. ప్రజా రవాణా మరియు అత్యవసర సేవల వాహనాలు నిరాటంకంగా వెళ్లేలా వ్యాపారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆయన కోరారు. రోడ్లపై క్రమశిక్షణ పాటిస్తేనే ప్రమాదాలను తగ్గించవచ్చని, వ్యాపారులు, వాహనదారులు మరియు పాదాచారులు పరస్పర సహకారంతో నడుచుకుంటేనే సురక్షిత వాతావరణం ఏర్పడుతుందని ట్రాఫిక్ సీఐ నరసింహ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# గోదావరి పుష్కరాలకు ఎప్పుడు పనులు ప్రారంభించాలో సూచనలిస్తున్న అధికారులు..



భద్రాచలం మార్చి 13 నిర్భయ వార్త ప్రతినిధి.: పవిత్ర పుణ్యక్షేత్రమైనటువం భద్రాచలంలో వచ్చే సంవత్సరం జరిగే గోదావరి పుష్కరాలకు చేపట్టబోయే కార్యాచరణ పై ప్రత్యేక సమావేశం గోదావరి కరకట్ట పక్కన ఉన్న డంపింగ్ యార్డ్ మరియు శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణం జరిగే మిథిలా స్టేడియం లోని పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు పాయం వెంకటేశ్వర్లు పినపాక శాసనసభ్యులు ఐటీడీఏ పీవో బి రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రగిరి మార్ట్ శ్రీరామనవమి నాటికి పూర్తి చేయాలి..

## ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్





భద్రాచలం 13 మార్చ్ నిర్భయ వార్త ప్రతినిధి. సహజ సిద్ధమైన గిరిజన ఉత్పత్తులు, వాటి పోషక విలువలు ఆరోగ్య ప్రయోజనాలను గుర్తించి ప్రజలకు అత్యంత చేరువగా అందుబాటులో లభించేలా ప్రస్తుత ఉన్న గిరి బజారును భద్రగిరి మార్ట్ గా రూపకల్పన చేసి ఈనెల శ్రీరామనవమి పండుగనాడు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నందున సంబంధిత అధికారులు మీకు అప్పగించిన పనులను సోమవారం నాటికి పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. శుక్రవారం నాడు ఐటిడిఏ సమావేశం మందిరంలో త్వరలో ప్రారంభించబోయే భద్రగిరి మార్ట్ కి వివిధ నిత్యవసర వస్తువులు సేకరణకు నియమించబడ్డ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన యూనిట్ అధికారుల వారీగా ఎస్ హెచ్ జి గ్రూపు మహిళలు తయారు చేస్తున్న వివిధ రకాల సహజ సిద్ధమైన




ముడి సరుకులు మరియు గిరిజన రైతుల నుండి సేకరించవలసిన బియ్యం పప్పు ధాన్యాలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు కొన్ని సూచనలు లు మనం సేకరించే ప్రతి వస్తువు నాణ్యతగా మన్నికైనదిగా ఉండాలని ముఖ్యంగా తేనె మిల్లెట్ బిస్కెట్లు, పప్పుధాన్యాలు, వివిధ రకాల బియ్యం ఇతర గృహపకరణాలకు ఉపయోగపడే ప్రతి సరుకులు ఆర్గానిక్ సంబంధించినవే ఉండాలని అన్నారు. 88 ఎస్సిహెచ్జి మహిళా సంఘాలు మన గిరి ప్రొడక్ట్స్ అడవి ఫలాలు ప్రాచుర్యంలోకి తీసుకురావడమే కాక భద్రగిరి మార్ట్ కు వచ్చే వినియోగదారులకు సంతృప్తి చెందేలా చూడవలసిన బాధ్యత మనపై ఉందని అన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ ఏడి డీఈవో, ఏఒ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కొన్ని సూచనలు ఇస్తూ భద్రాచలంలో ప్రారంభించబోయే భద్రగిరి మార్ట్ కి వ్యవసాయ శాఖ సహకారం తప్పనిసరిగా కావాలని, మీ పరిధిలో ఉండే గిరిజన రైతులు వారు సేంద్రియ ఎరువులతో పండించే వివిధ రకాల పంటలు మధ్య దళారుల పాలు కాకుండా నేరుగా భద్రగిరి మార్ట్ కి అమ్మకాలు జరిపేలా చూడాలని, అలాగే డైరీ ఫారం కు సంబంధించిన ఆవు నెయ్యి గేదె నెయ్యి తో పాటు నాటు కోడిగుడ్లు కూడా నాణ్యతగా ఉన్నది తప్పనిసరిగా తీసుకుంటామని, అందుకు సంబంధించిన డాటా సోమవారం నాటికి ఐటీడీఏ ఉద్యానవన అధికారికి అందించాలని అన్నారు. గిరిజన ఎస్ హెచ్ జి మహిళలకు మరియు రైతులకు ఆర్థికంగా చేయూత అందించడానికి ఏర్పాటు చేస్తున్న భద్రగిరి మార్ట్ కి తప్పనిసరిగా మీ యొక్క సహాయ సహకారాలు అందించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, ఏవో సున్నం రాంబాబు, ఏపీవో పవర్ వేణు, ఏసీఎంవో రమేష్, పి వి టి జి అధికారి గనియ, డి ఎం జి సి సమ్మయ్య, డీఎస్ఓ ప్రభాకర్ రావు, జేడీఎం హరికృష్ణ, మేనేజర్ ఆదినారాయణ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా కుమ్మరి మొల్ల జయంతి వేడుక

**కవయిత్రి మొల్ల జీవితం అందరికీ ఆదర్శం**

**పూలమాలవేసి నివాళి అర్పించిన ఎమ్మెల్యే వెంకటరావు, సర్పంచ్ పూనెం కృష్ణ**





భద్రాచలం మార్చి నిర్భయ వార్త ప్రతినిధి. 13 : సామాన్యులకు అర్థమయ్యే రీతిలో, అచ్చ తెలుగు నుడికారంతో రామాయణాన్ని రచించి ప్రజలకు అందజేసిన కవయిత్రి "మొల్లమాంబ" గొప్ప దార్శనికురాలని ఎమ్మెల్యే వెంకటరావు అన్నారు. కుమ్మరి మొల్ల జయంతి సందర్భంగా కుమ్మర శాలివాహన ప్రజాపతి సంఘం (కె.ఎస్.పి) ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మొల్ల చిత్రపటానికి పూలమాలవేసి అయిన నివాళీలు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరావు మాట్లాడుతూ... రామాయణాన్ని సరళంగా రచించి శ్రీకృష్ణదేవరాయల మన్ననలు పొందిన కవయిత్రి మొల్ల జీవితం అందరికీ ఆదర్శమన్నారు. భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ మాట్లాడుతూ... తెలుగు కవితా రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని పొందడంతో పాటు నాటి సమాజంలో నెలకొన్న లింగ, కుల వివక్షతలను బద్దలు కొట్టి చరిత్రలో చిరస్థాయిగా మొల్లమాంబ నిలిచిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షులు గంగాధర వీరయ్య, గౌరవ సలహాదారులు కొలిచలం నవీన్, డివిజన్ అధ్యక్షులు విజ్జిగిరి రాజా కిరణ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఇందారపు లక్ష్మణ్, గౌరవ అధ్యక్షులు నిమ్మనుగొట్టి రవికుమార్, ఉపాధ్యక్షులు రెల్లీ తాతారావు, సహాయ కార్యదర్శి దడపల్లి సత్యనారాయణ, కోశాధికారి విజ్జిగిరి రవితేజ, ఇటికల కోటేశ్వరరావు, సిలివేరు భద్రయ్య, సిలివేరు కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# బొల్లారం రైల్వే స్టేషన్ అభివృద్ధికి కేంద్రానికి ఈటల రాజేందర్ లేఖ

## అమృత్ భారత్ స్టేషన్ పథకంలో చేర్చాలని కేంద్రానికి విజ్ఞప్తి



మల్కాజిగిరి నిర్భయవార్త స్టేట్ బ్యూరో: మల్కాజిగిరి లోక్‌సభ సభ్యుడు ఈటల రాజేందర్ బొల్లారం రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ కు లేఖ రాశారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న బొల్లారం రైల్వే స్టేషన్ ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు మరియు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు ముఖ్య రవాణా కేంద్రంగా నిలుస్తోందని ఆయన లేఖలో పేర్కొన్నారు. హైదరాబాద్ ఉత్తర ప్రాంతాలను నగరంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానించే కీలక స్టేషన్‌గా బొల్లారం రైల్వే స్టేషన్ పనిచేస్తోందని తెలిపారు. అయితే ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ప్లాట్‌ఫారమ్‌లు, వేచివుండే గదులు, టికెటింగ్ సదుపాయాలు , ఇతర ప్రయాణికుల సౌకర్యాలు సరిపోవడం లేదని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికుల భద్రత, సౌకర్యం దృష్ట్యా స్టేషన్‌ను ఆధునీకరించడం అత్యవసరమని ఈటల రాజేందర్ అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో 'అమృత్ భారత్ స్టేషన్' పథకం కింద బొల్లారం రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఈ పథకం కింద స్టేషన్‌ను అభివృద్ధి చేస్తే ఆధునిక సౌకర్యాలు ఏర్పడి ప్రయాణికులకు మరింత సౌలభ్యం కలుగుతుందని, అలాగే ప్రాంతీయ రవాణా వ్యవస్థ కూడా మెరుగుపడుతుందని తెలిపారు. బొల్లారం స్టేషన్ అభివృద్ధి వల్ల స్థానిక ప్రజలకు ప్రయోజనం కలగడమే కాకుండా హైదరాబాద్ ప్రాంతంలోని రైల్వే నెట్‌వర్క్ మరింత బలోపేతం అవుతుందని పేర్కొంటూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర రైల్వే మంత్రిని విజ్ఞప్తి చేశారు.

# రంజాన్ సందర్భంగా ముస్లిం మహిళలకు 'ఈద్ కా తోఫా' పంపిణీ

**మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: బండి రమేష్**






కూకట్‌పల్లి నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: ముస్లిం మైనార్టీల పట్ల సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 'ఈద్ కా తోఫా' కానుకలను శుక్రవారం మోతీనగర్ బబ్బుగూడ ప్రాంతంలోని ముస్లిం మహిళలకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పర్వదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, శాంతి సౌహార్ద వాతావరణంలో ప్రజలందరితో కలిసి రంజాన్ ఉత్సవాలను జరుపుకుంటున్న ముస్లిం సోదరులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గోపిశెట్టి రాఘవేందర్, మజీద్ కమిటీ సభ్యులు ఇమ్రాన్, ఇస్మాయిల్, సలీం, నయీం, బకరం బుచ్చయ్య, సుదాకర్ రెడ్డి, రాజేష్, శ్రీను, ఇర్ఫాన్, వసీం, గోపాల్ చౌదరి, కమ్మర్ ఉద్దీన్, ఆనంద్ రెడ్డి, కోటిరెడ్డి, వెంకటేష్ గౌడ్, షకీర్, రంగప్ప, కురువ రాజు, ప్రసాద్, శివ, సాథ్విక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక..



మూడుచింతలపల్లి, నిర్భయవార్త ప్రతినిధి : మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధి లక్ష్మాపూర్ 3,4,5 వార్డులల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మున్సిపల్ కమిషనర్ జే.పవన్ కుమార్ ఆధ్వర్యంలో శానిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. వార్డులల్లో రహదారులు,డ్రైనేజీలు,పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పారిశుద్ధ్యం పై ప్రజల్లో అవగాహన కల్పించడం లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహించమన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం శానిటేషన్ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మున్సిపల్ డస్ట్ బిన్లలో వేయాలని,తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఉష, శనిటేషన్ ఇన్స్పెక్టర్ మోహన్ సింగ్, మున్సిపల్ చైర్మన్ జాం రవి, కౌన్సిలర్లు నిరాజ్ గౌడ్,చిన్నలచ్చ సరిత శ్రీనివాస్ గౌడ్,కటికల శ్రీవాణి వైద్యనాథ్,నవీన్ నాయక్, 3,5 వార్డుల కాంగ్రెస్ అధ్యక్షుడు కటికల గోపి,జనరల్ సెక్రటరీ కొమ్ము లక్ష్మణ్, నాయకులు,చిన్నలచ్చ శ్రీనివాస్ గౌడ్,కటికల వైద్యనాథ్,కొంపల్లి బుమేష్ గౌడ్,మాజీ ఎంపిటిసి పారుపల్లి నాగరాజు,మాజీ ఎంపిపి సింగం సత్యనారాయణ,మాజీ సర్పంచ్ సింగం ఆంజనేయులు, బండి రవీందర్,కీసరి నర్సింహులు,మంద స్వామి,శాడా శావుకరి, చిత్తయ్య గౌడ్,మంగ కృష్ణ గౌడ్,పారుపల్లి జహంగీర్,కీసరి వెంకటేష్,వట్టెం వేణు,బందేల యాదగిరి,కొమ్ము స్వామి మున్సిపల్ సిబ్బంది మంగ నర్సింహులు,తోట ప్రవీణ్ తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆర్టీసీలో మోగిన సమ్మె సైరన్

హైదరాబాద్, మార్చి 13: తెలంగాణ ఆర్టీసీలో మరోసారి సమ్మె సైరన్ మోగింది. టీజీఎస్ ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు సమ్మె నోటీసులు ఇచ్చారు. శుక్రవారం నాడు బస్ భవన్‌లో ఆర్టీసీ ఉన్నతాధికారులకు జేఏసీ నేతలు సమ్మె నోటీసులు ఇచ్చారు. అనంతరం లేబర్ కమిషనర్ కార్యాలయంలో సమ్మె నోటీసు ఇచ్చారు జేఏసీ నేతలు. ఆర్టీసీ సమ్మె తేదీపై 14 రోజుల తరువాత నిర్ణయం తీసుకుంటామని.. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్లడం ఖాయమని జేఏసీ నేతలు తేల్చి చెప్పారు.



బాపట్ల జిల్లా నూతన విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న జ. శ్రీనివాస్ గారిని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ తరపున చైర్మన్ డాక్టర్ బి. శరత్ బోస్,ప్రధాన కార్యదర్శి గురజాల శ్రీనివాసరావు కలిసి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించి,ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపన ధ్యేయంగా సంస్థ కృషి చేస్తుందని వారికి జ్యూట్ బ్యాగును అందజేయడం జరిగినది. సంస్థ సేవా కార్యక్రమాలను గురించి తెలుసుకొని అభినందించినారు.

## విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ




మధిర మార్చి 13 నిర్భయవార్త ప్రతినిధి :మున్సిపాలిటీ పరిధిలో ఎంప్లాయిస్ కాలనీ 2వ వార్డులో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహం నందు ప్రభుత్వం అందించిన పరీక్షా సామాగ్రిని 10వ తరగతి విద్యార్థులకు అందించారు ఈ కార్యక్రమంలో 2 వ వార్డ్ కౌన్సిలర్ బనావత్.రమణానాయక్ మరియు కాంగ్రెస్ నాయకులు షేక్. గౌస్ ఉద్దీన్ గ పాల్గొన్నారు.అదే విధంగా కౌన్సిలర్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు.అలాగే ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి షేక్.సలీం మరియు వసతిగృహ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులుగా బుట్టి మహేందర్




ఇబ్రహీంపట్నం 13 నిర్భయవార్త ప్రతినిధి :తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు ఓరుగంటి ఆనంద్ పిలుపుమేరకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అధ్యక్షులు గా బుట్టి మహేందర్ ని నియమించడం జరిగింది. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెనిగె విష్ణువర్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొంత యాదిరెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బోసుపల్లి వీరేష కుమార్, చేతుల మీదగా నియామక పత్రం అందజేయడం జరిగింది. ఈ యొక్క సందర్భంగా బుట్టి మహేందర్, మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు ఓరుగంటి ఆనంద్ కి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెనిగె విష్ణువర్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొంత యాదిరెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బోసు పెల్లి వీరేష్ కుమార్, కి , ప్రత్యేక ధన్యవాదాలు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లో ఉన్నటువంటి నాలుగు మండలాల ఉద్యమకారు లకు ప్రత్యేకంగా తెలంగాణ ఉద్యమ వందనాలు తెలియజేస్తున్నా.

## ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని సద్వినియోగం చేసుకోండి: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

ఉమ్మడి వరంగల్ నిర్భయవార్త ప్రతినిధి :హనుమకొండ జిల్లా అభివృద్ధిని పరుగులు పెట్టించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక"లిపై అవగాహన సదస్సు గురువారం హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు.జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభంఈ అవగాహన సదస్సును వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, మరియు జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి గారు జ్యోతి ప్రజ్వలన చేసి అధికారికంగా ప్రారంభించారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై గ్రామీణ, పట్టణ ప్రజాప్రతినిధులకు ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు.99 రోజుల లక్ష్యం.. ప్రజా సంక్షేమమే ధ్యేయంసదస్సులో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు:నేరుగా ప్రయోజనం: ఈ ప్రణాళిక ద్వారా ప్రభుత్వ ఫలాలు ప్రజలకు నేరుగా అందుతాయి.మౌలిక వసతులు: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయాలి.సమన్వయం: అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి కావాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు ఒక టీమ్‌లా కలిసి పనిచేయాలి .జవాబుదారీతనం: ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించకూడదు."ప్రజలకు సేవ చేసే అవకాశం అందరికీ రాదు, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లాను ప్రగతి పథంలో నడపాలి."

## మధిర రూరల్ పోలీస్ స్టేషన్‌లో మామిడి మొక్కలు నాటిన ఏసీపీ సారంగపాణి



మధిర రూరల్ మార్చి 13 నిర్భయవార్త ప్రతినిధి :మధిర రూరల్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఏసీపీ సారంగపాణి ఆధ్వర్యంలో మామిడి మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా ఏసీపీ సారంగపాణి పేర్కొన్నారు. చెట్లు నాటడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవచ్చని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొని మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రతిజ్ఞ చేశారు. చెట్లు పెంచడం ద్వారా పర్యావరణ సమతుల్యత కాపాడబడుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధిర రూరల్ సీఐ మధు టౌన్ సిఐ రమేష్ ఎస్సైలు లక్ష్మీ భార్గవి, రమేష్,వెంకన్న, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## షాద్ నగర్ కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో కవయిత్రి మొల్ల జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్నగర్ నిర్భయవార్త ప్రతినిధి : తొలి తెలుగు కవయిత్రి గా వెల్లలేని విలువైన కవిత్వాన్ని తెలుగు ప్రజలకు అందించిన మహా కవయిత్రి మొల్ల అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రశంసించారు. షాద్ నగర్ కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో కవయిత్రి మొల్ల జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని మండల పరిషత్ ఆవరణలో ఆమె విగ్రహానికి పూలమాల వేసిన అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు కవయిత్రులలో తొలితరం కవయిత్రిగా పేరు మోసిన ఆమె రామాయణాన్ని వేద భాషల్లో రచించారని, వాల్మీకి మహర్షి రచించిన రామాయణాన్ని తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే తెలుగు భాషలో అందించడం గర్వించదగిన విషయమని పేర్కొన్నారు. ఎందరో మహా రచయిత్రులు మన తెలుగు తేజాలు వెలగడానికి ఆమె స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. తెలుగువారు ఉన్నంతకాలం, తెలుగు సాహిత్యం వెలుగులు పంచినంత కాలం ఆమె మన హృదయాల్లో ఉంటారని ప్రశంసించారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. షాద్ నగర్ కుమ్మరి సంఘం అధ్యక్షులు నడికూడ శ్రీశైలం మరియు ప్రధాన కార్యదర్శి రాయికల్ శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగనూరి బస్వం, మరియు కుమ్మరి సంఘం ఉపాధ్యక్షులు శ్రీశైలం, గ్రంథాలయం డైరెక్టర్ చంద్రశేఖర్ సాయిలు, పెంజర్ల రమేష్, వైన్స్ అంజయ్య, దూసకల్ రమేష్, బ్రహ్మయ్య, నరసింహ, వెంకటేష్, బాలరాజ్, కృష్ణ, ఆటో శ్రీను, రాపోల్ వెంకటేష్, కృష్ణయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు ఇకలేరు

### గుండెపోటుతో నిద్రలోనే కన్నుమూత

### తీవ్ర సంతాపం ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



ఇబ్రహీంపట్నం 13 నిర్భయవార్త ప్రతినిధి :మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు (83) కన్నుమూశారు. ఉదయం నిద్రలో నుండి లేచిన ఆయన మొఖం కడుక్కున్న పిదప నలతగా ఉందని మళ్లీ పడుకుని గుండెపోటుతో నిద్రలోనే కన్నుమూశారు. గత జూలై నెలలో ఆయన భార్య ముత్యాలమ్మ మరణించారు. 1989 నుండి 1999 వరకు సిపియం పార్టీ నుండి దశాబ్దకాలంపాటు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా ఆయన ప్రజలకు సేవలందించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఆయన చిన్న కుమారుడు కొండిగారి త్రిలోక్ కుమార్ ఇబ్రహీంపట్నం మున్సిపల్ కౌన్సిలర్ గా బిఆర్ఎస్ పార్టీ నుండి విజయం సాదించారు. మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన ఆయన , కుమారులు కిరణ్ , త్రిలోక్ కుటుంబాలతో కలిసి ఆయన ఇబ్రహీంపట్నం బృందావన్ కాలనీలో నివసిస్తున్నారు.ముగ్గురు కుమారులలో పెద్ద కుమారుడు అరుణ్ కుమార్ అనారోగ్యంతో కొంతకాలంక్రితం మృతిచెందారు.నిజాయితీకి నిలువుటద్దంలా ప్రజలకు నిస్వార్థ సేవలందించిన కొండిగారి రాములు గారి ఆకస్మిక మృతి పట్ల జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు , మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి తీవ్ర ధిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. అణగారినవర్గాల అభ్యున్నతికి తపించిన అభ్యుదయవాదిని కోల్పోయామని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. వారి కుటుంబానికి అండగా నిలబడతామని చెప్పారు. బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్ , మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి , సత్తు వెంకటరమణారెడ్డి తదితరులు కొండిగారి రాములు మరణంపట్ల తీవ్ర సంతాపం తెలియజేశారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

### యువత ర్యాష్ డ్రైవింగ్,త్రిబుల్ రైడ్ చేస్తే కేసులునమోదు..

### పిడిఎస్ బియ్యం విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు: వైరా ఏసిపి ఎస్.సారంగపాణి




మధిర మార్చి 13 నిర్భయవార్త ప్రతినిధి :తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అక్రమ రవాణా ప్రభుత్వ నిబంధనలకు లోబడి రవాణా చేయాలని అలాకాకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే అట్టి ఇసుక ట్రాక్టర్ల పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వైరా ఏసిపి సారంగపాణి తెలిపారు. శుక్రవారంనాడు రూరల్ పోలీస్ స్టేషన్లో జరిగిన విలేకరుల సమావేశంలో వైరా ఏసిపి సారంగపాణి మాట్లాడుతూ మధిర ఆంధ్ర సరిహద్దు ప్రాంతం నుండి అక్రమంగా ఇసుక తరలిస్తే సతపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదేవిధంగా రాష్ డ్రైవింగ్ చేసిన త్రిబుల్ రైడింగ్ డ్రైవింగ్ చేసిన లైసెన్స్ ఆర్ సి హెల్మెట్ లేకుండా రోడ్డుపై వాహనాలు నడిపిన అలాంటి వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారన్నారు. అదేవిధంగా వైరా డివిజన్ పరిధిలోని గంజాయి తాగిన అమ్మకాలు చేపట్టిన అలాంటి వారిపై కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారన్నారు. ఇసుక అక్రమ రవాణా జరిగే సమాచారాన్ని ప్రజలు ఇస్తే సమాచారం ఇచ్చిన వారికి తగిన పారితోషం ఇవ్వటం జరుగుతుందని వారు తెలిపారు. ముందుగా ఇసుక రవాణా చేసే వారితో అవగాహన సమావేశం ఏర్పాటు చేసి వారికి తగిన సూచనలు ఇవ్వటం జరుగుతుందని ఆ తర్వాత ఇసుక అక్రమ రవాణా జరిగితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో మధిర సీఐలు మధు రమేష్ రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొండిగారి రాములు భౌతికగాయానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి



ఇబ్రహీంపట్నం 13 నిర్భయవార్త ప్రతినిధి :ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి రెండు సార్లు ఎమ్మెల్యేగా నిస్వార్థంగా సేవలు అందించిన మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ కొండిగారి రాములు భౌతికగా యానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మంచాల సహకార సంఘం మాజీ చైర్మన్ వెదిరే హనుమంత్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముచ్చర్ల వెంకటేష్ యాదవ్, గుడ్డిమల్ల చంద్రయ్య, మార సురేష్, లక్ష్మా నాయక్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు వెదిరే సికిందర్ రెడ్డి, జవహర్ లాల్ కిషన్ నాయక్, కుకూడాల నరేందర్ రెడ్డి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## మునిసిపాలిటీలో పర్యటించిన మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్



మధిర, నిర్భయవార్త ప్రతినిధి : మధిర మున్సిపాలిటీ ఇల్లందరపాడులో మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ తో కలిసి చైర్మన్ విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా డ్రైన్ వ్యవస్థను పరిశీలించారు.మున్సిపాలిటీ నాలుగో వార్డు ఇల్లందులపాడు వ్యాప్తంగా ఉన్న కాల్వలను శానిటేషన్ సిబ్బంది శుభ్రపరిచారు.అదే విధంగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు దోమల నివారణకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు.ఈసందర్భంగా చైర్మన్ సుజాత మాట్లాడుతూ,పరిశుభ్రతే ప్రధానంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మురుగు కాల్వల్లో నీరు నిల్వ ఉండకుండా కాల్వలను శుభ్రం చేయించడం ద్వారా దోమల బెడద తప్పుతుందని చెప్పారు.మున్సిపాలిటీ వ్యాప్తంగా పారిశుధ్య కార్యక్రమాలు అనునిత్యం నిర్వహిస్తూ మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని,ఇందుకు అధికారులు సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు.మధిర మున్సిపాలిటీలో ఏ సమస్య తలెత్తినా ప్రజలు తనను నేరుగా సంప్రదించాలని,ఆ సమస్యను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి సూర్యదేవర కోటేశ్వరరావు,సామినేని రామనాథం,వాసిరెడ్డి నాగేశ్వరావు,కోట డేవిడ్, తాళ్లూరి రాధా కుమార్, బోడెపుడి గోపి,నంద్రు శ్రీనివాసరావు,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సి పి యం మాజీ ఎమ్మెల్యే కొండి గారి రాములు పార్థివదేహానికి నివాళు లర్పించిన మర్రి నిరంజన్ రెడ్డి



ఇబ్రహీంపట్నం 13నిర్భయవార్త ప్రతినిధి : ఇబ్రహీంపట్నం బృందావన్ కాలనీలో మాజీ ఎమ్మెల్యే కొండి గారి రాములు నివాసానికి చేరుకొని పార్థివ దేహం పై పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చిన టిపిసిసి సభ్యులు ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి లిరెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన నాయకుడు, నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన నికార్సైన కమ్యూనిస్టు ఉద్యమ నేత కొండిగారి రాములు మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది.ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన ఆయన జీవితం అందరికీ ఆదర్శం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఒక గొప్ప ఆదర్శ నాయకుడిని కోల్పోవడం చాలా బాధాకరం, సమాజం అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమైనవి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ మాజీ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, నాయకులు మంకాల దాస్, యాదగిరి, కౌన్సిలర్ నీళ్ల హరిదాసు గౌడ్, సర్పంచ్ లక్ష్మణ్ నాయక్, మాజీ సర్పంచ్ భూపతి గళ్ళ రాజు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాల్లో సిలిండర్ల కొరత లేదు..

మెదక్ నిర్భయవార్త ప్రతినిధి : మెదక్ జిల్లాల్లో గృహా అవసరాలకు ఎల్పిజి సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ డివి శ్రీనివాస రావు పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ కలెక్టరేట్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 3,84373 కనెక్షన్లు ఉన్నాయని,16 గ్యాస్ ఏజెన్సీల ద్వారా సరఫరా చేయడం జరుగుతుందన్నారు హోటల్స్, రెస్టారెంట్లలో అక్రమ గ్యాస్ నిల్వలపై దాడులు నిర్వహించి 44 సిలిండర్లను సీజ్ చేశామని వెల్లడించారు.ప్రజలు అనవసరంగా ఆందోళన చెంది అవసరానికి మించి అడ్వాన్సు గా బుకింగ్ చేసుకోవద్దని సూచించారు. జిల్లాలో గృహ వినియోగదారులకు వంట గ్యాస్ సరఫరా సాధారణంగా నిరంతరాయంగా కొనసాగుతోందని తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్లో, హాస్టల్లో, ఓల్డ్ ఏజ్ హోమ్ లో, పాఠశాలల్లో, అత్యవసర సేవలలో గ్యాస్ కొరత లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. అపోహలను అడ్డుపెట్టుకుని బ్లాక్ చేయాలని చూస్తే ప్రభుత్వం ఎంత మాత్రం ఉపేక్షించదని, కఠినమైన చర్యలకు ఉపక్రమిస్తుందని హెచ్చరించారు. తాజగా జరుగుతున్న ప్రచారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమంగా గ్యాస్ నిలువ చేయడం, అక్రమంగా మళ్లించడం, బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. అదే సమయంలో అపోహలను నమ్మి అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేసుకోవొద్దని, గృహా వినియోగ దారులకు సరిపడా గ్యాస్ సరఫరా చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్యాస్ సమస్యలు ఉంటే 9391942254 నెంబర్ ను సంప్రదించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల కొకసారి, గ్రామీణ 45 రోజులకు ఒకమారు ఎల్.పి.జి బుక్ చేసుకోవాలని గ్యాస్ వినియోగదారులకు సూచించారు. జిల్లాలో ఎక్కడైనా గ్యాస్ సరఫరాలో అంతరాయం కలిగే పరిస్థితులు, అక్రమాలు జరుగుతున్నట్లు గుర్తించిన పక్షంలో సంబంధిత అధికారులకు వెంటనే తెలియజేస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వినియోగదారుల హక్కులను పరిరక్షించడం, పారదర్శకంగా సేవలు అందించడం ప్రతి గ్యాన్ ఏజెన్సీ యొుక్క బాధ్యతగా గుర్తుచేశారు.ప్రజలు గ్యాస్ కొరత పై వస్తున్న అపోహలను నమ్మకూడదని, జిల్లాలో గ్యాస్ నిల్వలు, సరఫరా పూర్తిగా సమృద్ధిగా ఉన్నాయని పేర్కొన్నారు.

## చైనా బాదం వృక్షాలు తొలగిస్తాం..

**మున్సిపల్ చైర్మన్ జాం రవి హామీ**



మూడుచింతలపల్లి, నిర్భయవార్త ప్రతినిధి : మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని లక్ష్మాపూర్ 5వ వార్డులో ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా మున్సిపల్ చైర్మన్ జాం రవి పర్యటిస్తూ స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ కాలనీ ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరా సమస్యగా మారిందని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.అలాగే దొంతుల రఘురాములు ఇంటి సమీప కాలనీలో ఉన్న చైనా బాదం వృక్షాల వల్ల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆ వృక్షాల నుంచి వెలువడే దూది కళ్లలో పడుతూ చిన్నపిల్లలకు కంటి సమస్యలు వచ్చే పరిస్థితి నెలకొన్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన చైర్మన్ జాం రవి మాట్లాడుతూ ప్రజలకు హానికరంగా మారిన ఆ వృక్షాలను త్వరలోనే మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి తొలగించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలనీ నివాసుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు మున్సిపాలిటీ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

## మెడికల్ షాప్ యజమానులు, ఫార్మసిస్టులకు మందుల విక్రయాలపై అవగాహన సదస్సు

**నియమాలు తప్పనిసరిగా పాటించాలి.. ఏరియా డ్రగ్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్**



దమ్మాయిగూడ నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దమ్మైగూడ డివిజన్ పరిధిలోని వెంకటరమణ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో మెడికల్ షాప్ యజమానులు మరియు ఫార్మసిస్టులకు వివిధ రకాల మందుల విక్రయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరియా డ్రగ్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ పాల్గొని ఫార్మసిస్టులకు అవసరమైన మార్గదర్శకాలను వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోల్‌సేల్, రిటైల్‌గా విక్రయించే మందుల వివరాలను తప్పనిసరిగా రిజిస్టర్ లేదా కంప్యూటర్ రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ఎవరికీ ఎలాంటి మందులు విక్రయిస్తున్నామనే వివరాలతో పాటు బిల్ నంబర్, తేదీ తదితర సమాచారాన్ని క్రమం తప్పకుండా నమోదు చేయాలని తెలిపారు. హెచ్, హెచ్ఐ, టిబి మందులు, ఎక్స్ డ్రగ్స్ వంటి వివిధ షెడ్యూల్ మందులను గుర్తించి జాగ్రత్తగా నమోదు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.అదేవిధంగా డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీబయాటిక్ మందులు విక్రయించకూడదని, ఇష్టానుసారంగా మందులు అమ్మడం నిబంధనలకు విరుద్ధమని హెచ్చరించారు. గడువు ముగిసిన మందులను వెంటనే వేరు చేసి నిల్వ చేయాలని, ఔషధాల విక్రయంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.కార్యక్రమంలో ఫార్మసిస్టులు ఏరియా డ్రగ్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్‌ను శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సదస్సులో స్థానిక మెడికల్ షాప్ యజమానులు, ఫార్మసిస్టులు పాల్గొన్నారు.

# కట్టెల పొయ్యే శరణ్యం



- వంట చెరకుకు ఆకస్మికంగా పెరిగిన డిమాండ్
- క్వింటాల్ కట్టెలు రూ.రెండు వేలు పై మాటే
- రవాణ చార్జీలు అదనం
- క్యాటరింగ్, హోటల్స్, హస్టల్స్ కు కట్టేలే దిక్కు
- ఇక గృహిణులు చూపు ఇండక్షన్ స్టౌల పైన
- మల్టీ రేటేడె ఎలక్ట్రానిక్స్ కుక్కర్లకు యమ డిమాండ్
- ఒక్కసారిగా ధరలు పెంచేసిన కంపెనీలు

**పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా వాణిజ్య గ్యాస్ సిలిండర్ల కొరతతో హైదరాబాద్ నగరంలో కట్టెలకు ఫుల్ డిమాండ్ పెరిగింది. మూడు రోజుల కిందట క్వింటాల్ రూ.1200 ఉన్న వంట చెరుకు, ఇప్పుడు రెట్టింపు ధరలు పలుకుతున్నాయి. అసలే పెళ్లిళ్ల సీజన్ కావడంతో పలు ఫంక్షన్ హాళ్లు, హాస్టల్, రెస్టారెంట్ల నిర్వాహకులు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. సిలిండర్ల సరఫరా తగ్గడంతో ముఖ్యంగా హోటళ్ల వ్యాపారంపై ప్రభావం పడుతోంది.**

**- హైదరాబాద్, ఆంధ్రప్రభ**

గ్యాస్ కొరతతో ప్రత్యామ్నాయంగా నగరంలోని చాలా హోటళ్లు, ఫంక్షన్ హాల్స్‌నిర్వాహకులు కట్టెలపై వంటలు చేస్తుండటతో వంట చెరుకుకు డిమాండ్ ఏర్పడింది. దీంతో టింబర్ డిపోల దగ్గర భారీగా బారులు తీరుతున్నారు. దీంతో కట్టెల మండి నిర్వాహకులు ధరలు అమాంతం పెంచేశారు. గ్యాస్ కొరత ఏర్పడక ముందు వరకు క్వింటాలు కట్టెలు రూ. వెయ్యి నుంచి రూ. 1200 వరకు ఉంటే.. ఇప్పుడు క్వింటాల్‌కు రూ. 2 వేల వరకు పలుకుతోంది. దీంతో గ్యాస్ సిలిండర్ ధరల భారం తగ్గించుకుందామని కట్టెల పొయ్యి వైపు చూస్తుంటే అక్కడ కట్టెల మంట తప్పడం లేదు.

### హోటల్స్‌పై మరింత ఎఫెక్ట్..

ఇక హోటల్స్, రెస్టారెంట్లు, హాస్టల్స్‌కట్టెల పొయ్యిలపై వంట కంటిన్యూ చేస్తున్నారు. అయితే, మూడు, ఐదంతస్తులు ఇలా ఉండి కింది అంతస్థుల్లో హాస్టల్స్, హోటల్స్, రెస్టారెంట్లు రన్‌చేస్తున్నవారికి కష్టాలు తప్పడం లేదు. కట్టెల పొయ్యిపై వంట చేస్తే పై అంతస్థుల్లో ఉన్నవారు పొగతో ఉక్కిరి బిక్కిరవుతున్నారు. ఓపెన్‌స్పేస్‌ఉన్నవారు అక్కడ కట్టెలతో అక్కడ వండుకుంటున్నారు. ఈ ఛాన్స్‌లేని వారు మూసేస్తున్నారు.

### ఓయూను తాకిన సెగ

ప్రతిష్టాత్మక ఓయూ హాస్టల్స్‌కు సిలిండర్ల కొరత సెగ తాకింది. ఇక్కడ మొత్తం 20 వరకు హాస్టల్స్‌ఉండగా, 8 వేల నుంచి 10 వేల మంది వరకు స్టూడెంట్స్ ఉంటున్నారు. ఒక్కో హాస్టల్‌కు రోజూ నాలుగు కమర్షియల్‌సిలిండర్లు ఇచ్చేవాళ్లు.. ఇరాక్-ఇజ్రాయిల్, అమెరికా యుద్ధం కారణంగా కొరత ఏర్పడడంతో ఇప్పుడు రోజు రెండు సిలిండర్లు మాత్రమే ఇస్తున్నారు. వేపుళ్లు లాంటి వాటికి సిలిండర్ వాడాలని, మిగతా వాటికి అంటే అన్నం, కూరలకు కట్టెల పొయ్యిలపై చేయాలని చెప్పడంతో అలాగే చేస్తున్నారు. అయితే, పొగతో ఇబ్బందులు పడుతున్నామని, వేల సంఖ్యలో ఉన్న విద్యార్థులకు రోజూ మూడు పూటలా కట్టెల పొయ్యిపై వండడం కష్టమని కుక్‌లు చెప్తున్నారు. దీంతో భోజనం పెట్టడం ఆలస్యం అవుతుందంటున్నారు.

### ట్రాన్స్ పోర్టేషన్ పై ఆంక్షలు

మరోవైపు ట్రాన్స్‌పోర్టేషన్‌ఖర్చులు భారం కావడంతో పాటు కట్టెల తరలింపుపై సిటీలో ఆంక్షలు ఉండటంతో డిమాండ్ కు తగ్గ సరఫరా లేక రేట్లు మండుతున్నాయి. ధరలు ఒక ఎత్తయితే, వంటలు చేసే మనుషులు దొరక్కపోవడం హోటళ్లు, ఫంక్షన్స్ హాల్స్, హాస్టల్స్‌వారికి పెద్ద సమస్యగా మారింది. గ్యాస్ స్టవ్‌లు, బర్నర్లకు అలవాటు పడిన నేటి తరం వంటవాళ్లు కట్టెల పొయ్యిపై వండేందుకు ఆసక్తి చూపడంలేదు.

### పెండ్లిళ్లు, ఫంక్షన్లపై ఎఫెక్ట్..

పెండ్లిలు, ఫంక్షన్లు చేస్తున్న వారికి గ్యాస్ సమస్య పెద్ద సవాల్ గా మారింది. పెండ్లిల సీజన్ కావడం, డబ్బులు ఎక్కువగా పెట్టినా గ్యాస్ దొరక్కపోవడంతో నిర్వాహకులతో పాటు పెండ్లిళ్లు చేసుకుంటున్న కుటుంబాలకూ ఇబ్బందులు తప్పడం లేదు. పెండ్లిళ్లకు ముందుగానే ఫంక్షన్ హాల్స్ బుక్ చేసుకోగా మూడు రోజుల నుంచి గ్యాస్ సమస్య తలెత్తడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కట్టెల పొయ్యిలపై వంట చేసేందుకు సిద్ధమవుతున్నారు. అయితే, వంటలు వండేవాళ్లు కట్టెల పొయ్యిపై అయితే తాము వచ్చేది లేదని తెగేసి చెప్తున్నారు. ఊరికే కట్టెలు పెట్టడం, తీయడం చేయాలని, తమకు అలవాటు లేదని చెప్తున్నారు. అలాగే వండిన తర్వాత మసి పట్టిన గిన్నెలు తోమడానికి కూడా పనివాళ్లు రావడం లేదు.

### ఇండక్షన్ స్టవ్ లకు డిమాండ్

ఎల్పీజీ సిలిండర్ల కొరత నేపథ్యంలో భారతీయులు ఇండక్షన్ స్టవ్‌లను తెగ కొనేస్తున్నారు. దీంతో ఆన్‌లైన్, ఆఫ్ లైన్ స్టోర్లలో వివిధ రకాల ఇండక్షన్ స్టవ్‌లు స్టాక్ లేకుండా పోతున్నాయి! కొన్ని ఆఫ్‌లైన్ స్టోర్లు, సూపర్ మార్కెట్లలో మాత్రం స్టాక్ పరిమితంగా ఉంటున్నది. మెట్రో పాలిటన్ నగరాల్లోని ప్రజలు ముందు జాగ్రత్త చర్యగా వీటిని కొనుగోలు చేస్తున్నట్టు తెలుస్తున్నది. గ్యాస్ కొరత ఉండదని కేంద్ర ప్రభుత్వం భరోసా ఇస్తున్నా.. సిలిండర్ల సరఫరాలో జాప్యం కారణంగా ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. దీంతో ప్రత్యామ్నాయం కోసం విద్యుత్తుతో పనిచేసే స్టవ్‌లను వంటకు ఉపయోగించాలని ప్రజలు భావిస్తున్నారు. ఇక మల్టీ ఎలక్ట్రానిక్ కుక్కర్లకు కూడా ఊహించనంత డిమాండ్ ఏర్పడింది.. ఏకకాలంలో అన్నం, కూరలు వండుకునే వెసులుబాటు ఉన్న ఈ కుక్కర్లు ధరలు కూడా అమాంతంగా పంచేశారు. బ్రాండెడ్ కంపెనీల కుక్కర్లు ఆన్ లైన్ లో ఇప్పుడు రూ.ఎనిమిది వేల నుంచి తొమ్మిది వేలు పలుకుతున్నది.. సాధారణంగా వీటి ధర ఆరు వేల నుంచి ఏడు వేలు మధ్యలో లభ్యమయ్యేవి.

## రుద్రమదేవి ఓల్డ్ ఏజ్ హోమ్ నూతన కార్యవర్గం ఎన్నిక



జనగాం జిల్లా నిర్భయవార్త ప్రతినిధి :జనగాం జిల్లా షామీర్పేటలోని కోమటిరెడ్డి సుశీలమ్మ భవనంలో నిర్వహించబడుతున్న రుద్రమదేవి ఓల్డ్ ఏజ్ హోమ్ కు నూతన కార్యవర్గ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. గత ఏడాది పాటు సేవలందించిన పాత కమిటీని రద్దు చేసి, నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షురాలిగా శ్రీమతి నీలం కవిత, ఉపాధ్యక్షురాలిగా శ్రీమతి నూకల లక్ష్మి, కార్యదర్శిగా పున్నం మానస ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా గుడిసె స్వాతి, దుబ్బాక స్వప్న, గర్దాసు లక్ష్మి, కలకుంట్ల ఉష, లింగాల సరిత, గాద రజిత ఎన్నికయ్యారు. "అవ్వ–తాత మీ కోసం మేమున్నాం" అనే నినాదంతో నిరాశ్రయులైన వృద్ధులకు ఆశ్రయం కల్పించడంలో రుద్రమదేవి ఓల్డ్ ఏజ్ హోమ్ ముందుంటుందని నిర్వాహకులు తెలిపారు. వృద్ధాప్యంలో నిరాధారంగా జీవిస్తున్న వారికి ఈ ఆశ్రమం అండగా నిలిచి సేవలు అందిస్తుందని నూతన కార్యవర్గం పేర్కొంది. ఇకపై రుద్రమదేవి ఓల్డ్ ఏజ్ హోమ్ కార్యక్రమాలు నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో కొనసాగుతాయని వారు పత్రికా ప్రకటనలో తెలిపారు.

# కొమ్ముూరి ప్రతాప్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో "సాప్ కోడ్ నవోన్నతి 25-26" కార్యక్రమం ప్రారంభం





ఘట్‌కేసర్, మార్చి 13 నిర్భయవార్త ప్రతినిధి :వేడ్చల్ జిల్లాలోని ఘట్‌కేసర్ మండలంలో ఉన్న కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో "సాప్ కోడ్ నవోన్నతి 25--26" కార్యక్రమాన్ని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన సాప్ కోడ్ నవోన్నతి గదిని మంత్రి వివేక్ వెంకట స్వామి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కళాశాల చైర్మన్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసే ఈ నవోన్నతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసి విద్యార్థులను ప్రోత్సహించిన మంత్రి వివేక్ వెంకట స్వామికి కృతజ్ఞతలు తెలిపారు. తాను గతంలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసిన సమయంలో వెంకట స్వామి కార్మిక శాఖ మంత్రిగా ఉన్నారని గుర్తు చేశారు. మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ, కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారని ప్రశంసించారు. విద్యార్థులు జీవితంలో ఎదగాలంటే చదువుపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. అల్లరి చేసే సమయం వేరు, చదువుకునే సమయం వేరు అని అన్నారు. తాను డాక్టర్ చదువుతున్న సమయంలో తన తండ్రి ఒక ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేయమని పంపిన సందర్భాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. "గుర్రాన్ని చెరువు దగ్గరకు తీసుకెళ్లగలం కానీ నీళ్లు తాగించలేం" అనే సామెతను ఉదాహరణగా చెబుతూ, అవకాశాలు వచ్చినప్పుడు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏ పని చేసినా శ్రద్ధతో నేర్చుకుంటేనే విజయం సాధించవచ్చని తెలిపారు. ఇప్పటి కాలంలో కొత్త కొత్త సాంకేతిక పరిజ్ఞానాలు వస్తున్నాయని, వాటిని చూసి భయపడకుండా నేర్చుకుంటే భవిష్యత్తు మరింత మంచి దిశగా ఉంటుందని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల నుండి వచ్చిన విద్యార్థులకు మంత్రి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పవనీ జంగయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు మహేష్ గౌడ్, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పలు కళాశాలలో పరీక్ష సెంటర్ల నందు కరపత్రాల పంపిణీ




మధురై నిర్భయవార్త ప్రతినిధి : 2026 -27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మధిర అధ్యాపక బృందము కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రవీంద్రారెడ్డి సూచనలను అనుసరించి కళాశాల అధ్యాపక బృందం వైస్ ప్రిన్సిపాల్ జి.అరుణ నేతృత్వంలో బృందాలుగా వివిధ ఇంటర్మీడియట్ పరీక్ష సెంటర్లను సందర్శించారుమైనారిటీ జూనియర్ కళాశాల, మధిర మరియు సుశీల జూనియర్ కళాశాల, మధిర పరీక్ష సెంటర్ల నందు విద్యార్థులను కలిశారు. శుక్రవారం నాడు ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు చివరి పరీక్ష రోజు కావడంతో విద్యార్థులకు కరపత్రాలను మరొకమారు ఇచ్చి ఉజ్వలమైన భవిష్యత్తుకు ఆనందకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అభ్యసించాలంటే ప్రభుత్వ డిగ్రీ కళాశాల మధిర నందే చేరాలని విజ్ఞప్తి చేశారు. కళాశాల పూర్వ విద్యార్థులు సాధించిన ప్రగతిని, కళాశాలలో జరుగుతున్న అభివృద్ధిని విద్యార్థులకు తెలియజేశారు. అంతేకాకుండా కొంతమంది ఇంటర్ సెకండియర్ విద్యార్థులను కళాశాలకు ఆహ్వానించి ఇక్కడ ఉన్న సౌకర్యాలను తరగతి గదులను ప్రత్యక్షంగా పరిశీలించారు ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.అరుణ, దోస్త్ కోఆర్డినేటర్ డా. ఎస్.ఇందిర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. పి. సుజాత, పి. లక్ష్మీనారాయణ, షేక్ ఇమ్రాన్, పి శ్రీనివాస్, డా. కే. రామకృష్ణ డా.వి నాగరాజు,వెంకటేష్, ఎస్. జ్యోతి, పి.మాధురి, ఎం.హారిక పాల్గొన్నారు.

## అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న 18వ వార్డు

**మున్సిపాలిటీలో ఏ సమస్య తలెత్తినా నేరుగా సంప్రదించండి అందుబాటులో ఉంటా: కోన ధనికుమార్**




మధిర మార్చి 13 నిర్భయవార్త ప్రతినిధి : స్థానిక 18వ వార్డు, లడక్ బజార్ పరిధిలో త్రాగునీటి సమస్య, పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి శాశ్వత పరిస్కారం చూపాలని, సత్వరమే పిచ్చిమొక్కలు తొలగించి కాలువలు శుభ్రం చేయాలని వైస్ చైర్ పర్సన్ కోన ధనికుమార్ ఆదేశించారు. ప్రజాపాలన ప్రగతికి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మధిర మున్సిపాలిటీ 18వ వార్డు లడక్ బజార్ లో స్థానిక నాయకులతో కలిసి వైస్ చైర్మన్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా డ్రైన్ వ్యవస్థను, విస్తరించి ఉన్న పిచ్చి మొక్కలను మూసుకుపోయిన నాళాలను పరిశీలించారు. మున్సిపాలిటీ 18 వార్డు మునుగోటి ఇంటి వద్ద లడక్ బజార్ వ్యాప్తంగా ఉన్న కాల్వలను శానిటేషన్ సిబ్బంది శుభ్రపరిచారు. అదే విధంగా దోమల నివారణకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు ఈసందర్భంగా వైస్ చైర్మన్ ధని కుమార్ మాట్లాడుతూ, పరిశుభ్రతే ప్రధానంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మురుగు కాల్వల్లో నీరు నిల్వ ఉండకుండా కాల్వలను శుభ్రం చేయించడం ద్వారా దోమల బెడద తప్పుతుందని చెప్పారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా పారిశుధ్య కార్యక్రమాలు అనునిత్యం నిర్వహిస్తూ రాష్ట్రంలో 18వ వార్డును మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, ఇందుకు అధికారులు సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. మధిర మున్సిపాలిటీలో ఏ సమస్య తలెత్తినా ప్రజలు తనను నేరుగా సంప్రదించాలని, ఆ సమస్యను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ వార్డు మెంబర్ మోదుగు బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాహాటం శ్రీనివాసరాజు, భాను ప్రసాద్, వార్డు ఆఫీసర్ గౌస్ బేగం, ఉషారాణి, మున్సిపల్ శానిటైజేషన్ ఇన్చార్జి వెంకట్ మరియు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన 15వ వార్డ్ కౌన్సిలర్ నకిరేకంటి రాజేశ్వరి.



మధిర మార్చి 13నిర్భయవార్త ప్రతినిధి :పట్టణంలోని 15వ వార్డులో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని వార్డ్ కౌన్సిలర్ నకిరేకంటి రాజేశ్వరి సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, సౌకర్యాలు, పరిశుభ్రత పరిస్థితులను ఆమె పరిశీలించారు. పిల్లల ఆరోగ్యం, పోషణ, విద్యాభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కీలకమని రాజేశ్వరితెలిపారు. చిన్నారులకు నాణ్యమైన ఆహారం మరియు సరైన సంరక్షణ అందేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. అంగన్వాడి కేంద్రంలో ఉన్న పిల్లలతో మాట్లాడి వారికి ప్రేమగా ముచ్చటిస్తూ వారి ఆరోగ్య పరిస్థితులను కూడా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది మరియు స్థానిక మహిళలు పాల్గొన్నారు. వార్డ్ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని కౌన్సిలర్ నకిరేకంటి రాజేశ్వరి తెలిపారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి

**హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలం**

**కొనుగోలు కేంద్రాలు లేక దళారీల పాలవుతున్న మొక్కజొన్న రైతులు**

**కేసీఆర్ పాలనలో కరోనా సమయంలోనూ రైతులకు అండగా నిలిచాం: లింగాల కమల్ రాజు**



మధిర మార్చి 13 నిర్భయవార్త ప్రతినిధి : నియోజవర్గ పరిధిలో చింతకాని తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించడంలోనూ, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలోనూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఖమ్మం మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమలరాజు విమర్శించారు. శుక్రవారంనాడు చింతకాని మండలంలోని నాగులవంచ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు వంకాయలపాటి సత్యనారాయణ నివాసంలో ఏర్పాటు సమావేశంలో సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చింతకాని మరియు బోనకల్లు మండలాలు రాష్ట్రంలోనే అత్యధికంగా మొక్కజొన్న పండించే ప్రాంతాలని తెలిపారు. అయితే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మొక్కజొన్నకు రూ. 2,400 మద్దతు ధర ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులు రూ. 1,600కే కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. మొక్కజొన్న రైతులను ఆదుకోవాలంటే వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎలాంటి ఆపదలేని పరిస్థితుల్లో కూడా ప్రభుత్వానికి 'రాజకీయ కరోనా' సోకినట్లుగా రైతులను గాలికొదిలేశారని ఎద్దేవా చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో జిల్లా మంత్రులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గతంలో పంట నష్టం జరిగితే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా పొలాల్లోకి వెళ్లి రైతులకు భరోసా ఇచ్చి, నిబంధనలకు అతీతంగా పరిహారం అందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఊరూరా తిరిగి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతు భరోసా కింద రూ. 15 వేల సహాయం ఇస్తామని చెప్పి నేడు మాట తప్పుతున్నారని విమర్శించారు. అలాగే వృద్ధులకు రూ. 4 వేల పెన్షన్, వికలాంగులకు రూ. 6 వేల పెన్షన్ ఇస్తామని ప్రకటించిన హామీలు కూడా అమలు కావడం లేదని అన్నారు. రైతు బీమా అందక రైతుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మేము కొత్తగా ఏమీ అడగడం లేదని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే కోరుతున్నామని తెలిపారు. యూరియా కోసం లైన్లలో నిలబడి, కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి రైతులకు రావడం దురదృష్టకరమని అన్నారు. ఈ కార్యక్రమంలోమంకెన రమేష్, కార్యదర్శి బొడ్డు వెంకట రామారావు, మాజీ ఎంపీపీ పొనుగోటి రత్నాకర్, మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు, గడ్డం శ్రీనివాస్, వేముల నర్సయ్య, అప్పారావు, బండి రామారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పరిగడ్డలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ


**గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే సహకారం అభినందనీయం: సర్పంచ్ చందు నాయక్**





షాద్నగర్, నిర్భయవార్త ప్రతినిధి : షాద్నగర్ నియోజకవర్గం ఫరూఖ్ నగర్ మండల పరిధిలోని ఉప్పరిగడ్డ గ్రామంలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ చందు నాయక్ ఆధ్వర్యంలో ఎంపికైన లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. ?ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... గ్రామంలోని పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని అన్నారు. గతంలో మొదటి విడత కింద 9 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయగా, వాటిని పూర్తి చేయడం జరుగుతుందని, ప్రస్తుత రెండో విడతలో మరో 5 మందికి పట్టాలు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని ఆయన లబ్ధిదారులకు హామీ ఇచ్చారు. గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంలో స్థానిక ఎమ్మెల్యే చూపిస్తున్న చొరవ, సహకారం మరువలేనిదని సర్పంచ్ చందు నాయక్ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో ఇళ్ల అవసరం ఉన్న మరికొందరి కోసం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, మరో 15 ఇళ్లు మంజూరు చేయడానికి ఆయన సానుకూలంగా స్పందించారని, త్వరలోనే వాటిని కూడా లబ్ధిదారులకు అందజేస్తామని వెల్లడించారు. ?తమకు ఇళ్ల పట్టాలు అందడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీలత తిరుపతి, ఇందిరమ్మ ఇండ్ల కమిటి సభ్యులు భీమ్లా నాయక్, బొజ్యానాయక్, గజేంద్ర నాయక్, గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సినిమా సిత్రం



## మనోహారి!

- సాక్షి లుక్స్ అదుర్స్
- వెల్వెట్ దుస్తుల్లో గ్లామర్ షో

ప్రముఖ మోడల్ కం నటి సాక్షి మాలిక్ సోషల్ మీడియాలో తన లేటెస్ట్ ఫోటోషూట్‌తో మరోసారి సెన్సేషన్ సృష్టించింది. లెహంగాలో అందచందాలు, ముగ్ధ మనోహర రూపం ఈ ఫోటోషూట్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఫిట్‌నెస్ విషయంలో ఈ ముంబై డాల్ కి ఉన్న మక్కువ ఆ స్లిమ్ అండ్ టోన్డ్ బాడీలో స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా సన్‌సెట్ వెలుగులో సాక్షి గ్లామర్ మరింత రెట్టింపు అయ్యింది. సాక్షి మాలిక్ కేవలం అందంపైనే కాకుండా తన బల శిక్షణ, ఆత్మవిశ్వాసంపై కూడా దృష్టి సారిస్తుందని ఈ ఫోటోలు నిరూపిస్తున్నాయి. సాక్షి మాలిక్ తన కెరీర్‌ను ఒక మోడల్‌గా ప్రారంభించి.. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా అనతి కాలంలోనే విపరీతమైన గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా బాలీవుడ్ చిత్రం `సోను కే టిటు కి స్వీటీ`లోని బొమ్ డిగి డిగి పాటతో సాక్షి ఓవర్‌నైట్ స్టార్‌గా మారిపోయింది. కేవలం కొన్ని సెకన్ల పాటు ఆ పాటలో కనిపించినా సాక్షి అందం, ఎనర్జీ ప్రేక్షకులను కట్టిపడేశాయి. ఢిల్లీకి చెందిన ఈ భామ ఇంజనీరింగ్ చదివినా.. గ్లామర్ రంగంపై ఉన్న ఆసక్తితో ముంబైకి చేరుకుని తన కలను సాకారం చేసుకుంది. ఈ బ్యూటీ ప్రయాణం కేవలం గ్లామర్ ఫోటోషూట్లకే పరిమితం కాలేదు. పలు ప్రముఖ బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ.. ఫిట్‌నెస్ అండ్ లైఫ్ స్టైల్ విషయంలో ఎందరో యువతులకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో మిలియన్ల కొద్దీ ఫాలోవర్లను సంపాదించుకున్న సాక్షి నిరంతరం తన కెరీర్‌లో ఎదుగుతూనే ఉంది. వ్యక్తిగత జీవితంలోనూ ఆమె ఎంతో సానుకూల దృక్పథంతో ఉంటూ.. కష్టపడి పని చేసే తత్వమే తన విజయానికి మూలమని నమ్ముతుంది.

## శర్వానంద..బైకర్!

- బాడీ వెయిట్ పూర్తిగా తగ్గింపు



యంగ్ హీరో శర్వానంద్ ప్రస్తుతం 'బైకర్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతున్న విషయం తెల్సిందే. ఈ సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న బైకర్ సినిమా కోసం శర్వానంద్ గతంలో ఎప్పుడూ లేని విధంగా కొత్త లుక్‌లో కనిపించబోతున్నాడు. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ ఫోటోలు చూస్తూ ఉంటే బైకర్ కోసం శర్వానంద్ ఏ స్థాయిలో కష్టపడ్డాడో, ఎలా కనిపించబోతున్నాడో క్లారిటీ వస్తుంది. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో రూపొందుతున్న బైకర్ సినిమాను ఏప్రిల్ 3న విడుదల చేసేందుకు గాను ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. షూటింగ్ ఇప్పటికే పూర్తి చేసినట్లుగా మేకర్స్ చెబుతున్నారు. ఈ సినిమాలో శర్వానంద్‌తో పాటు సీనియర్ హీరో రాజశేఖర్ ముఖ్య పాత్రలో నటించడంతో అంచనాలు భారీగా ఉన్నాయి.

### శర్వానంద్ బైక్ రేసర్‌గా...

ఈ సినిమాలో శర్వానంద్‌ను ఒక ప్రొఫెషనల్ మోటార్ బైక్ రేసర్ పాత్రలో చూడబోతున్నాం. ఈ సినిమాలో మాళవిక నాయర్, రాజశేఖర్ ఇంకా ప్రముఖ నటీనటులు కనిపించబోతున్నారు. రేసింగ్ సన్నివేశాలతో సినిమా ఆకట్టుకుంటుంది అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు చెబుతున్నారు. అంతే కాకుండా సినిమా మొదటి నుంచి చివరి వరకు రేసింగ్‌తో పాటు, ఒక ఎమోషన్ ను కలిగి ఉంటుందని, ఆ ఎమోషన్‌కి ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు అంటూ యూనిట్ సభ్యులు చెబుతున్నారు. బైకర్ సినిమా ఫలితంపై చిత్ర యూనిట్ సభ్యులు చాలా నమ్మకంగా కనిపిస్తున్నారు.

## యాక్షన్ మోడ్‌లో అనుష్క!

- కొత్త మూవీకి ఓకే చెప్పేసింది
- నందినిరెడ్డి దర్శకత్వంలో థ్రిల్లర్



క్రిష్ దర్శకత్వంలో రిలీజ్ అయిన అనుష్క శెట్టి మూవీ ఘాటి బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోవడంతో, అనుష్క సినిమాలకు స్వస్తి చెబుతుందనే వార్త ప్రచారంలోకి వచ్చింది. కేవలం తెలుగు సినిమాలకే దూరం అవుతుందని ఇతర భాషలు సహా కొత్త పరిశ్రమల్లో లాంచ్ అయ్యే అవకాశం ఉందని కథనాలొస్తున్నాయి. అయితే ఈ వార్తల్లో ఏంత మాత్రం నిజం లేదని తేలిపోయింది. అనుష్క తెలుగులో తన తదుపరి ప్రాజెక్టును పట్టాలెక్కించడానికి సిద్ధమవుతున్నారనే వార్త ఇప్పుడు అభిమానుల్లో, సినీ వర్గాల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. అనుష్క కెరీర్ విషయంలో స్పష్టమైన దృక్పథంతో ఉన్నారు. ఒక్క పరాజయం ఎదురైనంత మాత్రాన వెనకడుగు వేసే నటి కాదు. తాజాగాసమాచారంప్రకారంలేడీ డైరెక్టర్ నందిని రెడ్డి చెప్పిన స్టోరీకు అనుష్క గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. కథలోని వైవిధ్యం, ఆమె పాత్రలోని లోతు నచ్చడంతో షూటింగ్ కోసం కాల్‌షీట్లు కేటాయించినట్లువినిపిస్తోంది.సినిమాలో అమ్మడు సరికొత్త మేకోవర్‌తో కనిపించబోతున్నారుట. సోషల్ డ్రామా విత్ సస్పెన్స్ ఎలిమెంట్స్ తో కూడిన కథగా తెలిసింది. మహిళా ప్రాధాన్యత ఉన్న చిత్రాలను ఎంచుకోవడంలో అనుష్క ఎప్పుడూ ముందుంటారు. నందినీ రెడ్డి ఈ కథను డీల్ చేసే విధానం కొత్తగా ఉండబోతోంద ట . ఇ లాంటిథ్రిల్లింగ్ అంశాలున్న కథను తెరకెక్కించడం నందిని రెడ్డికి కొత్త అనుభవం అని తెలుస్తోంది.



## లవ్ ఇన్స్యూరెన్స్ బేబమ్మ రొమాంటిక్

పింక్ కలర్ లెహంగాలో కృతిశెట్టి ఇన్ స్టాలో అందాల విందు

ప్రస్తుత కాలంలో హీరోయిన్లు ఎక్కువగా సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ను ఉపయోగిస్తూ తమ అందాలను ఆరబోస్తూ ఫాలోవర్స్ ను పెంచుకుంటున్నారు. తాజాగా మొదటి సినిమాతోనే 100 కోట్ల క్లబ్లో చేరి అందరి దృష్టిని తన వైపు తిప్పుకున్న బేబమ్మ అలియాస్ కృతి శెట్టి గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. కోలీవుడ్‌లో బిజీ అయిపోయిన ఈమె.. మరొకవైపు అభిమానులను ఆకట్టుకోవడానికి మీడియాలో బిజీగా మారిపోయింది. అందులో భాగంగానే తాజాగా ఇన్స్టా గ్రామ్ వేదికగా బేబీ పింక్ కలర్ లో లెహంగా ధరించి.. తన అందాలతో మెస్మరైజ్ చేసింది. భిన్నమైన ఫోటోషూట్ తో అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంది కృతి శెట్టి. ప్రస్తుతం పింక్ కలర్ లెహంగాలో తన మేని ఛాయను మిళితం చేస్తూ .. షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. కృతి శెట్టి ప్రస్తుత సినిమాల విషయానికి వస్తే..ప్రదీప్ రంగనాథన్ తో కలిసి లవ్ ఇన్స్యూరెన్స్ కంపెనీ అనే రొమాంటిక్ డ్రామా చిత్రంలో నటించిన ఈమె.. జయంరవి ప్రధాన పాత్రలో నటిస్తున్న జీనీ అనే భారీ బడ్జెట్‌లో భాగమైంది. అలాగే టోవినో థామస్ సరసన మలయాళ చిత్రం ఏ ఆర్ ఎం లో కూడా నటిస్తోంది. అంతేకాదు మరికొన్ని తమిళ , తెలుగు చిత్రాలు లైన్లో పెట్టినట్లు సమాచారం.

## ఉస్తాద్‌కు.. బూస్టింగ్!

- ఏపీలో ధరలు పెంపు
- తెలంగాణ సాధారణ రేట్లు
- బెనిఫిట్ షోల కోసం ₹500
- ₹100 నుంచి ₹150 వరకు పెంచుకునే వెసులుబాటు



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మాస్ హవా మొదలవ్వడానికి ఇంకా వారం రోజులే సమయం ఉంది. హరీష్ శంకర్ దర్శకత్వంలో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాపై ఉన్న హైప్ దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టికెట్ రేట్ల పెంపుకు అధికారికంగా అనుమతినిచ్చింది. ఈ నెల 19న ఉగాది కానుకగా విడుదల కాబోతున్న ఈ చిత్రం ఇప్పటికే సెన్సార్ పూర్తి చేసుకుని 'యు/ఎ' సర్టిఫికెట్ అందుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో టికెట్ రేట్ల వివరాలు చూస్తే.. బెనిఫిట్ షోల కోసం రూ. 500గా నిర్ణయించారు. ఇక రెగ్యులర్ షోలవిషయానికి వస్తే,సింగిల్‌స్క్రీన్స్‌లో పాతధరలకుఅదనంగారూ.100,మల్టీప్లెక్స్‌లలో రూ. 125 పెంచుకోవడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సినిమా బడ్జెట్ పవన్ కళ్యాణ్ మార్కెట్ రేంజ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏపీలో ఉదయం 4 లేదా 5 గంటలకే షోలు మొదలవ్వబోతుండటంతో థియేటర్ల వద్ద సందడి నెలకొనడం ఖాయంగా కనిపిస్తోంది. మరోవైపు తెలంగాణలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. అక్కడ మేకర్స్ ఎటువంటి టికెట్ రేట్ల పెంపును కోరలేదు. ప్రభుత్వం నిర్ణయించిన సాధారణ ధరలకే టికెట్లు విక్రయించనున్నారు. అలాగే మార్చి 18న ఎటువంటి ప్రీమియర్ షోలు ఉండవని, నేరుగా 19వ తేదీ ఉదయం 7 గంటల నుండి షోలు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల్లో వేర్వేరు వ్యూహాలతో ముందుకెళ్తుండటం ఇండస్ట్రీలో ఆసక్తికరంగా మారింది. ఏపీలో ఉన్న క్రేజ్ ను క్యాష్ చేసుకుంటూనే, తెలంగాణలో సాధారణ ప్రేక్షకులను థియేటర్లకు రప్పించేలా ప్లాన్ చేశారు.



## 26/11 ముంబై దాడులు

- భారత భాగ్య విధాత పేరుతో మూవీ
- నర్స్ పాత్రలో కంగనా రనౌత్

బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ నర్సు పాత్రలో మెప్పించడానికి రెడీ అవుతున్నది. ప్రస్తుతం కంగన భారత భాగ్య విధాత అనే సినిమాలో నటిస్తోంది. ఇందులో కంగన నర్సు పాత్రలోనే కనిపించనుంది. 26/11 ముంబై దాడుల నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది. ఓ ఆసుపత్రిలో జరిగిన వాస్తవ సంఘటనలు ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. ఉగ్రవాదుల అధీనంలో ఉన్న ఆసుపత్రి అందులో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారందర్నీ వైద్య సిబ్బంది సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించారు? అన్నది చూపించడమే ఇతి వృత్తంగా తెరకెక్కిస్తున్నారు. ఆ సన్నివేశాలు, ఎమోషన్ ని హైలైట్ చేస్తూ మనోజ్ తపాడియా తెరకెక్కిస్తున్నారు. మరి నర్సు పాత్రలో కంగన ఎలా అలరిస్తుందో చూడాలి. ప్రయోగాల విషయంలో కంగన వెనకాడే నటి కాదు. రిస్క్ ను సైతం రస్క్ తీసుకున్నంత ఈజీగా తీసుకుంటుంది. అందుకే బాలీవుడ్ హీరోయిన్లు అందరిలో కంగన స్పెషల్ గా నిలిచింది.

Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197